
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
సోమవారం 3 జూన్ 2024





కౌంటింగ్ కేంద్రం వద్ద భద్రతపై సూచనలు చేస్తున్న ఎస్పీ మాలికాగార్గ్

ఓట్ల లెక్కింపునకు.. సన్నద్ధం

- కౌంటింగ్ కేంద్రం వద్ద మూడంచెల భద్రత
- రేపు ఉదయం 8 గంటల నుంచి లెక్కింపు ప్రారంభం
- కఠినంగా 144 సెక్షన్.. జిల్లా అంతటా కర్ఫ్యూ వాతావరణం



మాచర్లలో ఆక్టోపస్ బృందంతో ఫ్లాగ్‌మార్చ్



నిర్మానుష్యంగా ఉన్న మాచర్ల ప్రధాన రహదారి



కారంపూడిలో టీడీపీ కార్యాలయం వద్ద పోలీసు బలగాలు

అభ్యర్థుల భవితవ్యం దాగి ఉన్న ఈవీఎంలు మంగళవారం తెరుచుకోనున్నాయి. గెలుపోటములపై అభ్యర్థుల్లో టెన్షన్ ఉండగా.. ఓటర్లలో ఉత్కంఠ నెలకొంది. ఎన్నికల అంకంలో చివరి ఘట్టమైన ఓట్ల లెక్కింపునకు గడువు సమీపిస్తోంది. ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా అభ్యర్థుల జాతకాలు తేల్చే ఓట్ల లెక్కింపునకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. లెక్కింపు సమయంలో అప్రమత్తంగా ఉంటూ డేగ కళ్లతో పరిశీలిస్తూ వేగంగా లెక్కలు వేసే ఏజెంట్లను ఆయా అభ్యర్థులు ఎంపిక చేసుకుని వారికి శిక్షణ ఇచ్చి పక్కాగా సిద్ధం చేసుకున్నారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ ప్రత్యేక భద్రతా ఏర్పాట్లతో ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంది. జిల్లాలో 144 సెక్షన్ అమలుతో పాటు కఠినమైన ఆంక్షలతో ఘర్షణలు చోటుచేసుకోకుండా పోలీసులు అప్రమత్తమయ్యారు. మద్యం విక్రయాలతో పాటు బాణసంచా అమ్మకాలను నిషేధించారు. లెక్కింపు కేంద్రాల పరిసరాల్లో ఇతరుల ప్రవేశం లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నారు. పైగా కౌంటింగ్ కేంద్రం నుంచి 2 కిలోమీటర్ల వరకు రెడ్‌జోన్‌గా ప్రకటించారు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పల్నాడు జిల్లాలో పోలింగ్, ఆ తర్వాత పెద్దఎత్తున హింసాకాండ జరిగింది. ఈ నేపథ్యంలో ఓట్ల లెక్కింపు సమయం సమీపించినందున ఏ చిన్న సంఘటన జరగకుండా ప్రశాంతంగా జిల్లా ఎన్నికల యంత్రాంగం సిద్ధమైంది. కాకాని వద్ద ఉన్న జేఎన్‌టీయూ కళాశాలలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాల బయట భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కౌంటింగ్ ఏజెంట్లు నియామకం సహా ఓట్ల లెక్కింపులో పోషించాల్సిన పాత్రపై అభ్యర్థులు, వారి ఏజెంట్లకు అవగాహన కల్పించారు. ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు, భద్రతా చర్యలపై ఎప్పటికప్పుడు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీకేష్ బాలాజీ లత్కర్, ఎస్పీ మాలికాగార్గ్ పర్యవేక్షిస్తున్నారు. తొలి ఫలితం చిలకలూరిపేట, తుది ఫలితం గురజాల నియోజకవర్గానిది వెలువడుతుందని అంచనా వేస్తున్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా 144 సెక్షన్‌ను కఠినంగా అమలు చేస్తున్నారు. ఈ క్రమంలో జిల్లా అంతటా దుకాణాలను పోలీసు శాఖ మూసివేయించింది.

ర్యాలీలు.. విజయోత్సవ సభలు నిషేధం

పోలింగ్ సందర్భంగా జరిగిన హింస నేపథ్యంలో కౌంటింగ్‌ను ప్రశాంతంగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. శాంతిభద్రల దృష్ట్యా విజయోత్సవ సభలు, ర్యాలీలను నిషేధించినట్లు పోలీసు శాఖ ప్రకటించింది. ఇందుకు విరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. 5వ తేదీ వరకు మద్యం విక్రయాలను నిషేధించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద, అలాగే జిల్లాలో ఎక్కడా కూడా డ్రోన్లు ఎగరవేయడానికి ఎవ్వరికీ అనుమతి లేదని ఎస్పీ మాలికాగార్గ్ తెలిపారు.

కౌంటింగ్ కేంద్రాల వద్ద అసాధారణ భద్రత

కౌంటింగ్ కేంద్రాల వద్ద అసాధరణ భద్రత ఏర్పాటు చేశారు. బందోబస్తును ఎప్పటికప్పుడు ఎస్పీ పర్యవేక్షిస్తున్నారు. కౌంటింగ్ సెంటర్ లోపల బయట అణువణువు సీసీ కెమేరాల పర్యవేక్షణలో ఉంది. డ్రోన్ల సహాయంతో కౌంటింగ్ సెంటర్ వద్ద పరిస్థితిని, ట్రాఫిక్‌ని సమస్యాత్మక ప్రదేశాల్లో ప్రజల నడవడికలను పరిశీలిస్తున్నారు.

నిర్మానుష్యంగా పట్టణాలు

అభ్యర్థుల ఇళ్లు.. పార్టీ కార్యాలయాల వద్ద భద్రత

పోలింగ్ హింసతో జిల్లాలో పోలీసు శాఖ అప్రమత్తమైంది. జిల్లా అంతటా 144 సెక్షన్ రెండో రోజు ఆదివారం కొనసాగింది. దీంతో పట్టణాల్లోని ప్రధాన రహదారులు జనసంచారం లేక నిర్మానుష్యంగా మారాయి. కర్ఫ్యూను తలపిస్తోంది. 5వ తేదీ వరకు పోలీసు ఆంక్షలు కొనసాగనున్నాయి. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఇప్పటికే ఎస్పీ పోలీసులతో కవాతు నిర్వహించి ప్రజలను చైతన్యవంతం చేశారు. ముందస్తు చర్యల్లో భాగంగా ప్రధాన పార్టీ అభ్యర్థుల ఇళ్ల, వారి కార్యాలయాల వద్ద భద్రతా చర్యలు చేపట్టారు. ఆయా వీధులకు ఇనుప కంచె ఏర్పాటు చేశారు.

అభ్యర్థులు సహకరించాలి : కలెక్టర్

జేఎన్‌టీయూ కళాశాలలో ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీకేష్ బాలాజీ లత్కర్ తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించడానికి అభ్యర్థులు, ఏజెంట్లు సహకరించాలన్నారు. కలెక్టరేట్‌లో ఆదివారం ఆర్వోలతో జరిగిన సమావేశంలో కౌంటింగ్ కేంద్రాల్లో అభ్యర్థులు, ఏజెంట్లు పాటించాల్సిన అంశాలపై ఆయన సమీక్షించారు. సూపర్‌వైజర్లు, అసిస్టెంట్ సూపర్‌వైజర్లకు నియోజకవర్గాలు కేటాయించినట్లు తెలిపారు. 4న ఉదయం 5 గంటలకు ర్యాండమైజేషన్ ద్వారా కౌంటింగ్ సిబ్బందికి టేబుళ్ల కేటాయింపు చేస్తామన్నారు. 6 గంటల కల్లా అభ్యర్థులు, ఏజెంట్లు ఐడీ కార్డుతో పాటుగా ఫారం 18 తప్పని సరిగా తీసుకొస్తేనే మెయిన్ గేట్ వద్ద అనుమతిస్తామన్నారు. కౌంటింగ్ హాల్లోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్‌ఫోన్లకు అనుమతి లేదన్నారు. అభ్యర్థులు, ఏజెంట్లకు కేటాయించిన పార్కింగ్ లో మాత్రమే వాహనాలను పార్కింగ్ చేసుకోవాలన్నారు. కౌంటింగ్ పరిశీలకులు, ఆర్వోలు, ఏఆర్వోలు, కంప్యూటర్స్ ఆపరేటర్లకు మాత్రమే సెల్‌ఫోన్స్ కౌంటింగ్ కేంద్రంలోనికి అనుమతిస్తామన్నారు. అభ్యర్థుల సమక్షంలో స్ట్రాంగ్ రూములను 4న ఉదయం 6 గంటలకు తెరుస్తామన్నారు. మీడియా ప్రతినిధులకు కూడా కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతి లేదన్నారు. హింసాత్మక సంఘటనలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ మాలికాగార్గ్ తెలిపారు.

కౌంటింగ్‌కు 964 మంది సిబ్బంది

కౌంటింగ్‌కు రెండో రాండమైజేషన్ ద్వారా ఎన్నికల పరిశీలకుల ఆధ్వర్యంలో జిల్లా ఎన్నికల అధికారి ఆదివారం సిబ్బందిని ఆయా నియోజకవర్గాలకు కేటాయించారు. ఇందుకు 283 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లను, 353 మంది కౌంటింగ్ అసిస్టెంట్లను, 328 మంది మైక్రోఅబ్జర్వర్లు మొత్తం 964 మందిని కౌంటింగ్ విధులకు కేటాయించారు.

ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి, ఎస్పీ

జేఎన్టీయూ కాలేజీలో ఏర్పాటుచేసిన కౌంటింగ్ సెంటర్‌ను ఆదివారం జిల్లా ఎన్నికల అధికారి, ఎస్పీలు పరిశీలించారు. బారికేడ్లను, గుర్తింపు చిహ్నాలను పరిశీలించి తగు సూచనలు సలహాలు అందజేశారు. నియోజకవర్గాల వారీగా మొబైల్ ఫోన్లు భద్రపరిచే స్థలాలను పరిశీలించారు. పోలీసు సిబ్బందితో సమావేశమై భద్రత ఏర్పాట్లు గురించి వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో జేసీ శ్యాం ప్రసాద్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

బందోబస్తు పర్యవేక్షణకు ఐపీఎస్‌ల నియామకం

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా బందోబస్తు పర్యవేక్షించేందుకు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలీస్ ఉన్నతాధికారులు సమస్యాత్మక జిల్లాలకు ప్రత్యేకంగా ఐపీఎస్‌లను నియమించారు. నరసరావుపేట, సత్తెనపల్లి, వినుకొండ, పెదకూరపాడు నియోజకవర్గాలకు గ్రేహౌండ్స్ డీఐజీ గోపీనాథ్‌జెట్టిని నియమించారు. మాచర్ల, గురజాల నియోజకవర్గాలకు ఆక్టోపస్ ఐజీ సీహెచ్ శ్రీకాంత్‌ను నియమించారు. పల్నాడు జిల్లాలో నెలకున్న ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో శాంతి భద్రతల దృష్ట్యా వీరిని నియమించారు.

వినుకొండ రోడ్డులో ట్రాఫిక్ మళ్లింపు

జేఎన్‌టీయూ కాలేజీలో మంగళవారం ఓట్ల లెక్కింపు సందర్భంగా ఆ మార్గంలో ట్రాఫిక్‌ను మళ్లించారు. ప్రయాణికులకు, వాహనదారులకు ఇబ్బందులు తలెత్త కుండా నరసరావుపేట నుంచి పలు ప్రాంతాలకు ట్రాఫిక్ మళ్లింపు చేస్తున్నట్లు ఎస్పీ మాలికాగార్గ్ తెలిపారు. కౌంటింగ్ కేంద్రం వద్ద ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు సోమవారం రాత్రి 10.00 నుంచి కౌంటింగ్ పూర్తి అయ్యేంత వరకు నరసరావుపేట నుంచి వినుకొండ వైపు వెళ్లే భారీ, మధ్య తరహా రవాణా వాహనాలను దారి మళ్లిస్తున్నట్లు తెలిపారు.

- నరసరావుపేట నుంచి వినుకొండ వైపు వెళ్లే వాహనాలు స్టేషన్ రోడ్డు, లింగంగుంట్ల, ఇక్కుర్రు, రొంపిచర్ల క్రాస్ రోడ్డు మీదగా అద్దంకి నార్కెట్‌పల్లి హైవే మీదగా సంతమగులూరు క్రాస్ రోడ్ మీదగా వెళ్లాలి.
- నరసరావుపేట నుంచి ఒంగోలు వెళ్లే భారీ, మధ్య తరహా రవాణా వాహనాలు నరసరావుపేట నుంచి చిలకలూరిపేట మీ దగా వెళ్లి హైవే మీదగా వెళ్లాలి. ఎట్టి పరిస్థితుల్లో వినుకొండరోడ్డు వైపు ఉప్పలపాడు, పెట్లూరివారిపాలెం గ్రామాల మీదగా వాహనాలు అనుమతించరు. అత్యవసర, కౌంటింగ్ నిమిత్తం వాహనాలను మాత్రం అనుమతిస్తారు.

బార్లకు మినహాయింపుపై విమర్శలు

జిల్లాలో కఠినంగా 144 సెక్షన్ అమలు చేస్తూ పోలీసులు దుకాణాలను మూయించారు. మద్యం విక్రయాలను నిషేధిస్తున్నట్లు ప్రకటించారు. అయితే బార్ అండ్ రెస్టారెంట్లకు మినహాయింపు ఇస్తున్నారు. మద్యం దుకాణాలు తెరిచి యథేచ్ఛగా మద్యం విక్రయిస్తున్నారు. కూరగాయల విక్రయాలను నిలిపివేయించిన పోలీసులు మద్యం విక్రయాలకు అనుమతి ఇవ్వడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నరసరావుపేటలో పోలీసు స్టేషన్ల సమీపంలోనే మద్యం విక్రయాలు జరుగుతున్నాయి.



నరసరావుపేటలో తెరిచి ఉన్న బార్ అండ్ రెస్టారెంట్

ఓట్ల లెక్కింపు ఇలా..

అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల వారీగా ఓట్ల లెక్కింపు నకు సంబంధించి పోలింగ్ కేంద్రాల సంఖ్యను బట్టి రౌండ్లుగా విభజించారు. ప్రతి రౌండ్లో 14 పోలింగ్ కేంద్రాల పరిధిలో పోలైన ఓట్లను లెక్కస్తారు. అసెంబ్లీ, లోక్‌సభ పరిధిలోని ఓట్లను సమాంతరంగా లెక్కిస్తారు. ఉదయం 8 గంటల కల్లా కౌంటింగ్ ప్రారంభమవుతుంది. మొత్తం 15 కౌంటింగ్ హాళ్లలో లోక్‌సభ, ఏడు అసెంబ్లీల కౌంటింగ్ ప్రక్రియ నిర్వహిస్తారు.

పోస్టల్ బ్యాలెట్‌ల లెక్కింపు కీలకం

నరసరావుపేట లోక్‌సభ, ఏడు అసెంబ్లీ సెగ్మెంట్‌లకు సంబంధించి పోస్టల్ బ్యాలెట్‌లు 18,086 ఓట్లు, హోం ఓటింగ్‌లో 1,204 ఓట్లు పోలయ్యాయి. సర్వీస్ ఓట్లు లోక్‌సభకు 19,290 నరసరావుపేట అసెంబ్లీకి 3,727, పెదకూరపాడు 2,382, చిలకలూరిపేట 2,565, సత్తెనపల్లి 2,613, వినుకొండ 2,911, గురజాల 2,371, మాచర్ల నియోజకవర్గంలో 2,721 ఓట్లు పోలయ్యాయి. ఈ ఓట్ల లెక్కింపుకు లోక్‌సభకు ఒక కౌంటింగ్ హాల్‌లో 18 టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఒక్కొక్క అసెంబ్లీ స్థానానికి ఈవీఎంల ఓట్లు లెక్కించే హాల్‌లోనే ప్రత్యేకంగా రెండు టేబుళ్లు, మాచర్ల, సత్తెనపల్లి నియోజక వర్గాలకు మూడు టెబుళ్లను ఏర్పాటు చేశారు. కోర్టు ఆదేశాల మేరకు ప్రతి నియోజక వర్గంలో ర్యాండమ్‌గా ఎంపిక చేసిన ఐదు పోలింగ్ కేంద్రాల వీవీ ప్యాట్ స్లిప్పులు లెక్కిస్తారు. ఫారం-17సీలో పీవో నమోదు చేసిన ఓట్లు, ఈవీఎంలో ఓట్ల సంఖ్య తేడా వచ్చిన సందర్భాల్లో కూడా వీవీ ప్యాట్ స్లిప్పులు చివర్లో లెక్కిస్తారు.

కౌంటింగ్ రౌండ్లు ఇలా..

నియోజకవర్గం	బూత్‌లు	పోలైన ఓట్లు	రౌండ్లు
పెదకూరపాడు	266	2,07,307	19
చిలకలూరిపేట	241	1,92,655	18
నరసరావుపేట	245	1,88,701	18
సత్తెనపల్లి	274	2,10,500	20
వినుకొండ	299	2,36,036	22
గురజాల	304	2,30,944	22
మాచర్ల	299	2,19,766	22



ఈవీఎంలలో ఓట్ల లెక్కింపు హాల్‌లో ఏర్పాటు చేసిన బల్లలు



నిర్మానుష్యంగా నరసరావుపేటలోని ప్రధాన రహదారి



ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు నివాసం రహదారిలో ఇనుప కంచె

బ్రాహ్మణపల్లిలో బాంబుల కలకలం

రాజుపాలెం, జూన్ 2: పల్నాడు జిల్లాలో పోలింగ్ హింసాత్మక ఘటనలు ఇంకా మరిచిపోలేదు. పోలీసులు పెద్దఎత్తున తనిఖీలు చేపడుతున్నారు. హెచ్చరికలు జారీ చేస్తున్నారు. పలువుర్ని అరెస్టు చేసి జైళ్లకు కూడా పంపారు. ఈ పరిస్థితుల్లో కూడా పెట్రో బాంబుల తయారీ సామగ్రి దొరకడంతో అటు పోలీసు అధికారులతో పాటు సామాన్య ప్రజలు కూడా బెంబేలెత్తిపోతున్నారు. రాజుపాలెం మండలం బ్రాహ్మణపల్లిలో పెట్రోల్ బాంబుల తయారీ ముడిసరుకును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి తూర్పు దిక్కుగా ఉన్న ఓ గడ్డివాములో పెట్రోల్ బాంబులు దాచి ఉంచారనే సమాచారం ఆదివారం పోలీసులకు అందింది. దీంతో రాజుపాలెం ఎస్ఐ షామీర్‌బాషా, సత్తెనపల్లి రూరల్ సీఐ రాంబాబు సిబ్బందితో వెళ్లి ఆ ప్రాంతంలో తనిఖీ చేశారు. పెట్రోల్ బాంబుల తయారీకి ఉపయోగించే ముడిసరుకును గుర్తించి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఏఎస్పీ సోమశేఖర్, డీఎస్పీ గురునాథ బాబు అక్కడకు వచ్చి వాటిని పరిశీలించారు. బ్రహ్మణపల్లిపై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీసులను ఆదేశించారు. గ్రామానికి చెందిన గుర్రాల జగన్మోహన్ రావుకు చెందిన గడ్డివాములో 9 మద్యం క్వార్టర్ బాటిళ్లు, 8 ఖాళీ బీరు బాటిళ్లు, 1 ఆఫ్ బాటిల్, పెట్రోల్ నింపిన రెండు లీటర్ల బాటిళ్లు రెండు ఉన్నాయని ఎస్ఐ షామీర్ బాషా తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. వీటితో తమకు సంబంధం లేదని గుర్రాల జగన్మోహన్‌రావు తెలిపారు. ఎవరో గిట్టనివారు ఉద్దేశపూర్వకంగా తమ గడ్డివాములో దాచి కేసులో ఇరికించాలని చూస్తున్నారని చెప్పారు.



బ్రాహ్మణపల్లిలోని గడ్డివాములో నిల్వ ఉంచిన పెట్రోల్ బాంబుల తయారీ ముడిసరుకును స్వాధీనం చేసుకున్న పోలీసులు

కుటీర పరిశ్రమగా నాటుసారా

- కిడ్నీ, లివర్ రోగాలతో బాధితులు మృతి
- చిన్నాభిన్నం అవుతున్న పేద కుటుంబాలు
- సారా కట్టడిపై తూతూమంత్రపు దాడులతో సరి

మాచర్ల టౌన్, జూన్ 2: విపరీతంగా మద్యం ధరలు, నాసిరకం మద్యంతో మందుబాబులు నాటుసారా వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో డిమాండ్ పెరగడంతో మాచర్లలో నాటుసారా తయారీ ఓ కుటీర పరిశ్రమగా మారింది. నాటుసారా కారణంగా శ్రమజీవుల కుటుంబాలు అతలాకుతలం అవుతున్నాయి. అనారోగ్యంతోపాటు ఆర్థికంగా కూడా నష్టపోతున్నారు. ఆర్థికస్తోమత అంతంత మాత్రంగా ఉండి మద్యానికి బానిసైన వారు తక్కువ ధరకు అందుతున్న నాటుసారాను ఆశ్రయిస్తున్నారు. నాటుసారా తాగడం వల్ల అనారోగ్యానికి గురవుతున్నారు. లివర్, కిడ్నీ సంబంధిత వ్యాధులతో మృతి చెందుతున్నారు. నాటుసారాకు బానిసై యజమానిని కోల్పోయిన కొన్ని కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయి. నాటుసారా ఏరులై పారుతున్నా నిరోధించడంలో సెబ్ అధికారులు విఫలమయ్యారన్న విమర్శలున్నాయి. మాచర్ల మండలం హస్నాబాద్‌తండా, నారాయణరెడ్డిపురంతండాలు నాటుసారా తయారీకి ప్రధాన కేంద్రాలుగా ఉన్నాయి. గృహాలు, పొలాల్లో నాటుసారా తయారు చేయడం, విక్రయించడం రివాజుగా మారింది. తయారు చేసిన నాటుసారాను క్యాన్లలో నింపి రాత్రిళ్లు మాచర్ల పట్టణం, వెల్దుర్తి, దుర్గి, రెంటచింతల, కారంపూడి మండలం వరకు తరలిస్తుంటారు. తనిఖీలకు వచ్చిన సెబ్ అధికారులపై తిరగబడి దాడులు చేసిన సంఘటనలు కూడా ఉన్నాయి. మాచర్ల శివారు కాలనీలు, పురపాలక సంఘం వెనుకవైపు, నెహ్రూనగర్, వినాయకుని గుట్ట, రోప్‌లైన్ కాలనీ తదితర ప్రాంతాల్లో నాటుసారా విక్రయాలు అధికంగా జరుగుతున్నాయి. నాటుసారా విక్రేతలు పెట్ బాటిల్ రూ.100కు విక్రయిస్తున్నారు. నాటుసారా విక్రయాలు గురించి తెలిసినా సెబ్ అధికారులు అరకొరగా దాడులతో సరిపెడుతున్నారు. బుధవారం పట్టణంలో పోలీసులు కార్డెన్‌సెర్చ్ నిర్వహిస్తుండగా పశువుల ఆస్పత్రి వెనుక వైపున ఓ దిబ్బలో 20 లీటర్ల నాటుసారా క్యాను దొరికింది. నాటుసారా తయారీలో ప్రధానంగా ఉపయోగించే బెల్లాన్ని మాచర్ల నుంచి కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు. అర్ధరాత్రి వేళల్లో బెల్లాన్ని ఆటోలు ద్వారా తరలించి సారా తయారీకి ఉపయోగిస్తుంటారు. సుమారు రోజుకు టన్ను చొప్పున బెల్లం విక్రయమవుతుందంటే నాటుసారా తయారీ ఏ స్థాయిలో జరుగుతుందో అర్థమవుతోంది.

పెత్తనమంతా ఆ కానిస్టేబుల్‌దే..

మాచర్ల సెబ్ కార్యాలయంలో ఏళ్ల తరబడి పాతుకుపోయిన ఓ కానిస్టేబుల్ హవా సాగిస్తున్నారు. ఏ అధికారి అయినా అతడి కనుసన్నల్లో నడుచుకోవాల్సిందే. అధికార పార్టీకి చెందిన నాయకులతో అంటకాగుతూ తనకు తిరుగులేదని, తనపై అధికారులను కూడా లెక్కచేయకుండా హవా సాగిస్తున్నాడు. నాటుసారా తయారీ దారులు, బెల్లం విక్రేతలు, నాటుసారా విక్రేతలు వద్ద నుంచి మామూళ్లు దండుకుంటున్నాడు. మామూళ్లు ఇచ్చే వారిని వదిలేసి మిగతా వారిపై తన ప్రతాపం చూపిస్తుంటాడు. ఇటీవల ఓ సారా విక్రేత వద్ద ఉన్న ఫోన్ లాగేసుకుని ఓ నంబరుకు ఫోన్ చేసి మీ నంబరు సారా విక్రేత వద్ద ఎందుకు ఉంది అని ప్రశ్నించి పెద్దమొత్తంలో నగదు వసూలు చేసినట్లు సమాచారం. ఆ కానిస్టేబుల్ రాయవరం, కొత్తపల్లి జంక్షన్లలో అధికార పార్టీ వారితో కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారం నడుపుతున్నాడన్న ఆరోపణలున్నాయి. ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారులు ఎందుకు స్పందించడం లేదోనని ప్రజలు చర్చించుకుంటున్నారు.



బెల్లంఊటను పారబోస్తున్న సెబ్ అధికారులు (పాతచిత్రం)



దిక్సూచి DIKSUCHI

బిమ్స్‌టెక్



దేశాలు పరస్పరం సహకరించుకుంటూ, ఉమ్మడిగా అభివృద్ధి చెందే లక్ష్యంతో కూటమిగా జతకడుతుంటాయి. అదే అవి ఒక ప్రాంతానికి చెందిన దేశాలైతే భౌగోళిక, సాంస్కృతిక, సముద్రతీర అనుకూలతల వల్ల మరింత పటిష్ఠంగా ఆ కూటమి వర్థిల్లే అవకాశం ఉంటుంది. ఇటువంటి అనుకూలతలు గల ఒకానొక కూటమే బిమ్స్‌టెక్.

బలహీనపడిన సార్క్‌కు ప్రత్యామ్నాయంగా బిమ్స్‌టెక్‌ను ముందుకు తీసుకురావడానికి చేస్తున్న ప్రయత్నాల దృష్ట్యా ఈ కూటమి ఇటీవలికాలంలో మరింత ప్రాధాన్యం పొందుతోంది. అంతేకాక ఇటీవల(2024 మే 20) బిమ్స్‌టెక్ తొలి చార్టర్ అమలులోకి రావడంతో ఈ కూటమికి లీగల్ పర్సనాలిటీ సౌలభ్యమూ దక్కింది. దీనితో ఇకపై కొత్త దేశాలను కూటమిలోకి సులువుగా చేర్చుకోవడానికి, ఇతర కూటముల్లో, దేశాలతో ఈ కూటమి దౌత్యపరమైన చర్చలు జరపడానికి, కూటమి నిర్ణయాలు-తీర్మానాల పాటింపు ఇకపై చట్టబద్ధమై ఉండటానికి మార్గం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం వార్తల్లో ఉన్న బిమ్స్‌టెక్ పూర్వపరాలు, ఆవశ్యకత, ఎదుర్కొంటున్న సవాళ్లు, పటిష్ఠతకు తీసుకోవాల్సిన చర్యల కోణంలో పరిశీలించడం ముదావహం.

చారిత్రక నేపథ్యం

1997లో బ్యాంకాక్ డిక్లరేషన్ ద్వారా బంగ్లాదేశ్, ఇండియా, శ్రీలంక, థాయ్‌లాండ్ సభ్యులుగా 'బీఐఎస్‌టీ-ఈసీ' ఏర్పడింది. బీఐఎస్‌టీ-ఈసీ అంటే 'బంగ్లాదేశ్, ఇండియా, శ్రీలంక, థాయ్‌లాండ్ ఎకనమిక్ కోఆపరేషన్' అని అర్థం. అయితే ఇదే సంవత్సరం ఈ కూటమిలో మయన్మార్ కూడా చేరడంతో 'బీఐఎంఎస్‌టీ-ఈసీ' పేరు మారింది. అదేవిధంగా 2004లో నేపాల్, భూటాన్ కూడా ఈ కూటమిలో సభ్యులవడంతో దీని పేరును 'బే ఆఫ్ బెంగాల్ ఇనీషియేటివ్ ఫర్ మల్టీ సెక్టోరల్, టెక్నికల్ అండ్ ఎకనామిక్ కోపరేషన్(బీఐఎంఎస్‌టీఈసీ)'గా మార్చారు. ఈ కూటమి ప్రధాన కార్యాలయం బంగ్లాదేశ్‌లోని 'ఢాకా'లో ఉంది.

ప్రధాన ఉద్దేశం

బంగాళాఖాతం తీరం వెంబడి, సమీపంలో ఉన్న దక్షిణాసియా, ఆగ్నేయాసియాకు చెందిన కొన్ని దేశాలు తమ భౌగోళిక సామీప్యతను, స్థానిక వనరులను సమర్థంగా వినియోగించుకోవడం ద్వారా ప్రపంచీకరణ దుష్ప్రభావాలను ఉమ్మడిగా జయించే ప్రధానోద్దేశంతో బిమ్స్‌టెక్ కూటమిని ఏర్పాటుచేశాయి.

ప్రాథమిక సూత్రాలు

1. దేశాల సార్వభౌమత్వాన్ని ధృవీకరించడం.
2. ప్రాదేశిక సమగ్రతను పరిరక్షించడం.
3. దేశాల రాజకీయపరమైన స్వాతంత్ర్యాన్ని గౌరవించడం.
4. దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం లేకుండా ఉండటం. 5. శాంతియుత పరస్పర సహజీవనం
6. ఉమ్మడి లబ్ధికి పాటుపడటం.
7. సభ్యదేశాల మధ్య ద్వైపాక్షిక, ప్రాంతీయ, బహుపాక్షిక సంబంధాలను, సహకారాన్ని పరిరక్షించడం, పెంపొందించడం.

ప్రధాన సహకార అంశాలు

బిమ్స్‌టెక్‌లో ప్రధాన 14 అంశాలపరంగా పరస్పరం సహకరించుకోవడం జరుగుతుంది. అవి-

1. వాణిజ్యం, పెట్టుబడులు 2. వాణిజ్యం, సమాచార ప్రసారం 3. శక్తిరంగం 4. పర్యాటకరంగం 5. సాంకేతికరంగం 6. మత్స్యరంగం 7. వ్యవసాయరంగం 8. ప్రజారోగ్యం 9. పేదరిక నిర్మూలన 10. ఉగ్రవాద నిరోధం, అంతర్జాతీయ నేరాలు 11. పర్యావరణం, విపత్తు నిర్వహణ 12. సభ్యదేశాలకు చెందిన ప్రజల మధ్య పరస్పర అవగాహన 13. సాంస్కృతిక సహకారం 14. వాతావరణ మార్పులు

ఈ 14 పరస్పర సహకార అంశాలకు సంబంధించి ప్రతి దేశం కనీసం ఒకటి లేదా అంతకన్నా ఎక్కువ రంగాలకు మార్గదర్శక దేశంగా బాధ్యతలు తీసుకుంటుంది. భారతదేశం రవాణా, టూరిజం, పర్యావరణ, విపత్తు నిర్వహణ, కమ్యూనికేషన్లు, అంతర్జాతీయ నేరాలు, ఉగ్రవాద నిరోధం అంశాలకు సంబంధించి బాధ్యతలు వహిస్తోంది.

బిమ్స్‌టెక్ వ్యవస్థాగత నిర్మాణం

- **చైర్మన్‌షిప్:** ఆల్ఫాబెటికల్ ఆర్డర్‌లో సభ్యదేశాలకు దక్కుతుంది.
- **సమ్మిట్(సమావేశం):** సభ్యదేశాధినేతలు హాజరయ్యే ఈ సమావేశాల్లో విధానపర నిర్ణయాలు తీసుకుంటారు. అందుకే ఇది అత్యున్నత అంగముగా గుర్తింపు పొందింది.

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

- **మంత్రిత్వ స్థాయి సమావేశం:** ఇది విధాన నిర్ణయపరంగా రెండో అత్యున్నతస్థాయి అంగము. సభ్యదేశాల విదేశీ వ్యవహారాలశాఖ మంత్రులు హాజరవుతారు.
- **సీనియర్ అధికారుల సమావేశం:** దీనికి సభ్యదేశాల విదేశీ వ్యవహారాలశాఖకు చెందిన అనుభవజ్ఞులైన సీనియర్ అధికారులు హాజరై చర్చిస్తారు.
- **వర్కింగ్ గ్రూప్ మీటింగ్:** బిమ్స్‌టెక్ సభ్యదేశాలకు చెందిన బంగ్లాదేశ్‌లోని రాయబారులు/ దౌత్యవేత్తలు ఢాకాలోని బిమ్స్‌టెక్ సెక్రటేరియట్‌లో ప్రతి నెలా సమావేశమవుతారు.
- **బిజినెస్ ఫోరం, ఎకనామిక్ ఫోరం:** బిమ్స్‌టెక్ ప్రాధాన్యతా రంగాల్లో ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించే నిమిత్తం ఈ రెండు ఫోరమ్‌లు కీలకంగా వ్యవహరిస్తాయి.

ప్రాముఖ్యం

- బిమ్స్‌టెక్ రీజన్‌లో దాదాపు 1.5 బిలియన్ జనాభా అనగా ప్రపంచ జనాభాలో 22% ఉండటం వల్ల సభ్యదేశాలకు అతిపెద్ద మార్కెట్ అవకాశాలను అందిస్తోంది.
- బిమ్స్‌టెక్ దేశాల ఉమ్మడి జీడీపీ 3.6 ట్రిలియన్ డాలర్లు. ఇటీవలి కాలంలో 6.5% వరకూ సగటు వృద్ధిరేటు అంచనాలను ఇవి కలిగి ఉంటున్నాయి. ఇది ఈ ఆర్థికవ్యవస్థల పటిష్ఠ వృద్ధికి అనుకూల సంకేతాలనిస్తోంది.
- అదేవిధంగా ఈ కూటమి భౌగోళికత అయిన బంగాళాఖాత ప్రాంతంలో 15,792 చదరపు కిలోమీటర్ల మడ అడవులు, 8,471 చదరపు కిలోమీటర్లు పగడపు దీవులు, ఈస్టరీలు, సముద్రపు తాబేళ్ల పునరుత్పత్తి స్థావరాలు, సముద్ర కలుపు మొక్కలు వంటి విస్తార సముద్ర ఉత్పత్తులకు నిలయంగా ఉన్న పర్యావరణ సునిశిత ప్రాంతాలు ఉన్నాయి.
- బంగాళాఖాత సముద్ర మార్గం ద్వారా ఏటా ప్రపంచ వాణిజ్యంలో 25% జరుగుతుంది. అంతేకాక బంగాళాఖాత పరిసరాల్లో గల అపార ఖనిజ, సహజవాయు నిక్షేపాలు, మత్స్యసంపద వంటివి ఈ కూటమి దేశాలకు బ్లూ ఎకానమీ పరమైన అవకాశాలను అందిస్తున్నాయి. ఈ ప్రాంతంలో ప్రపంచంలోని చేపలవేటలో 7% అంటే ఆరు మిలియన్ టన్నులు(నాలుగు వందల కోట్ల డాలర్ల) చేపలవేట సాలీనా జరుగుతుంది.
- భూ పరివేష్టిత దేశాలైన నేపాల్, భూటాన్‌లకు సముద్ర అందుబాటు సౌలభ్యం కలుగుతుంది.
- పాకిస్థాన్ నిరంతరం భారత్ చర్యలకు అడ్డుపడుతూ సార్క్ కూటమిని బలహీనపరుస్తున్న కారణంగా, మరో ప్రత్యామ్నాయ కూటమి అవసరం ఈ భౌగోళిక ప్రాంతంలో ఏర్పడిన దృష్ట్యా, పాకిస్థాన్ రహితంగా ఉన్న బిమ్స్‌టెక్ ఆ స్థానాన్ని భర్తీ చేయగలదన్న ఆశాభావం సభ్యదేశాల్లో ఉంది.
- బిమ్స్‌టెక్ భౌగోళిక ప్రాంతంలో అనేక ప్రాంతీయ అభివృద్ధి ప్రాజెక్టులు ఉండటం వల్ల ఈ కూటమి ఆవసరాన్ని మరింత పెంచుతోంది. ఆ ప్రాజెక్టుల్లో భారత్-మయన్మార్‌లకు చెందిన కళాదన్ ప్రాజెక్టు, భారత్ - మయన్మార్ - థాయ్‌లాండ్‌లను అనుసంధానించే ఏషియన్ ట్రై లేటరల్ హైవే ప్రాజెక్టు, బంగ్లాదేశ్, భూటాన్, ఇండియా, నేపాల్ మోటార్ వెహికల్ అగ్రిమెంట్ వంటివి ఉన్నాయి.

భారత్‌కు బిమ్స్‌టెక్ అవసరం

- సార్క్ క్రియాహీనమవుతోన్న నేపథ్యంలో భారతదేశం తన విదేశీ దౌత్య వ్యూహాలైన యాక్ట్ ఈస్ట్ పాలసీ, నైబర్‌హుడ్ ఫస్ట్ పాలసీల అమలుకు తోడ్పడుతుంది.
- బంగాళాఖాత ప్రాంతంలో, హిందూ మహాసముద్ర ప్రాంతంలో పట్టుసాధించడానికి చైనా చేస్తున్న ప్రయత్నాలను భారత్ ఈ కూటమి ద్వారా ఎదుర్కొనే అవకాశం ఉంటుంది. చైనా స్ట్రింగ్ ఆఫ్ పెర్ల్స్, బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్ ద్వారా భారత్ చుట్టూ వల వేయడానికి వినియోగించుకుంటున్న నేపాల్, శ్రీలంక, బంగ్లాదేశ్, మయన్మార్, భూటాన్ వంటి దేశాలను బిమ్స్‌టెక్ కూటమి ద్వారా భారత్ చేరువ చేసుకోగలదు. అదేవిధంగా భారతదేశ 'సాగరమాల' పథకానికి కూడా ఈ కూటమి ఉపయుక్తం.
- ఈశాన్య రాష్ట్రాలకు సరిహద్దున గల మయన్మార్, బంగ్లాదేశ్‌లతో వాణిజ్యం, రాకపోకల పరమైన అనుకూలతలు సాధించడం ద్వారా ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి అవకాశం ఏర్పడుతుంది.
- ఈ కూటమి ఆగ్నేయాసియా, దక్షిణాసియా ప్రాంత దేశాలనే కాక హిమాలయ దేశాలు, బంగాళాఖాత తీర దేశాలను అందుబాటులోకి తెచ్చి సభ్య దేశాలతోపాటు భారత్‌కు కూడా బహుముఖ ఆర్థికలబ్ధిని చేకూర్చడంతోపాటు ఉగ్రవాదం, మాదక ద్రవ్యాలను దేశంలోకి చొరబడకుండా అడ్డుకోవడానికి సహకరిస్తుంది.
- ఈశాన్య భారత్‌కు అక్రమ వలసదారులను అడ్డుకోవడంలో బిమ్స్‌టెక్ కూటమి సభ్యత్వం తోడ్పడగలదు.

ఎదురవుతున్న సవాళ్లు

- ఈ కూటమి ప్రాధాన్యతా రంగాలైన వ్యవసాయం, ప్రజారోగ్యం, అనుసంధానం వంటివి చాలా విస్తారమైన అంశాలు. పైగా 14 ప్రాధాన్యతా రంగాలు ఉండటం వల్ల కూటమి లక్ష్యాలు విస్తారమై ఏ అంశం పరంగానూ ప్రత్యేక దృష్టి సారించలేకపోవడం.
- కూటమి ఆర్థికంగా పురోగమించాలంటే ఏర్పడాల్సిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఇంకా పట్టాలెక్కకపోవడం ఈ కూటమి లక్ష్యాలకు ప్రధాన ఆటంకంగా ఉంది.
- సభ్యదేశాల మధ్య అంతర్గతంగా ఉన్న సమస్యలు, సరిహద్దు వివాదాలు వంటివి (ఉదాహరణకు ఇండియా-నేపాల్ సరిహద్దు సమస్య, ఇండియా-బంగ్లాదేశ్ అక్రమ వలసల సమస్య, ఇండియా-శ్రీలంక కచ్చతీవు వివాదం మొదలైనవి) కూటమి మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నాయి.
- థాయ్‌లాండ్, మయన్మార్ వంటి దేశాలు బిమ్స్‌టెక్ కంటే ఏసియన్ కూటమి వైపు ఎక్కువ మొగ్గు చూపుతూ బిమ్స్‌టెక్‌పై తక్కువ ఆసక్తిని ప్రదర్శిస్తుండటం, అదేవిధంగా ఇతర సభ్యదేశాలు కూడా ఇతరత్రా ప్రాంతీయ కూటముల వైపు మొగ్గు కలిగి ఉండటం.
- ఇంతవరకూ బిమ్స్‌టెక్ బ్యాంక్ ఏర్పడకపోవడం, నిధుల వితరణ, సమకూర్పు వంటి ఒక కూటమి మనుగడకు కావల్సిన ఆర్థిక యాజమాన్యం బలహీనంగా ఉండటం.
- ప్రతి రెండేళ్లకోసారి నిర్వహించాల్సిన బిమ్స్‌టెక్ సమ్మిట్ నిర్వహణలో నిర్లక్ష్యం. ఇప్పటివరకూ కేవలం అయిదు సమ్మిట్‌లే జరగడం. తద్వారా ఆర్థిక, సాంస్కృతిక, మౌలికరంగపరమైన సంస్థల మధ్య సరైన అనుసంధానత అంటూ ఇంకా ఏర్పడకపోవడం.

పటిష్ఠతకు తీసుకోవాల్సిన చర్యలు

1. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని వీలైనంత త్వరగా పట్టాలెక్కించడం.
2. క్రమం తప్పకుండా ద్వైవార్షికంగా బిమ్స్‌టెక్ సమ్మిట్‌ను జరిపి కార్యాచరణ ప్రణాళికలు అమలుచేయడం.
3. 14 ప్రాధాన్యత రంగంలో అతి ప్రాధాన్యతా రంగాలను గుర్తించి ప్రత్యేక దృష్టి కేంద్రీకరించడం.
4. బిమ్స్‌టెక్ బ్యాంకు ఏర్పాటును వేగిరం చేయడం.
5. ఇండియా పెద్దన్నపాత్ర వహిస్తూ, బిమ్స్‌టెక్‌లో ఆధిపత్యం చెలాయిస్తోందన్న అపవాదును తొలగించుకునేందుకు 'గుజ్రాల్ డాక్టరిన్' వంటి చొరవలను భారత్ ఆరంభించడం.
6. బ్లూ ఎకానమీ దిశగా సభ్యదేశాలను ఉత్సాహపరిచేందుకు భారత్ నేపాల్, భూటాన్ వంటి దేశాలకు తన తీరప్రాంతంలో కార్యకలాపాలకు అవకాశం కల్పించడం, బంగ్లాదేశ్, మయన్మార్‌లకు సాంకేతిక సహకార బదిలీ ద్వారా వాటిని ఆకట్టుకోవడం వంటి చర్యలపరంగా కూటమిని బలపరిచేందుకు కూటమిలో పెద్ద దేశమైన భారత్ చొరవ తీసుకోవాల్సి ఉంది.
7. డిజిటల్ ఎకానమీ, స్పేస్ టెక్నాలజీ వంటి అంశాలను కూడా ప్రాధాన్యతాంశాల్లో చేర్చి ఇతర బిమ్స్‌టెక్ దేశాలకు భారత్ సహకరించడం ద్వారా ఈ కూటమిని పటిష్ఠం చేసే అవకాశం ఉంది.

భౌగోళికంగా బంగాళాఖాత తీర దేశాలే కూటమి అని వ్యవహరిస్తున్నా, అంతకుమించి ఇతర ప్రాంతాలనూ ఇప్పటికే కలుపుకొని ఇకపై ఇతర దేశాలకూ ఆహ్వానం పలకడానికి సిద్ధంగా ఉన్న బిమ్స్‌టెక్ వ్యూహాత్మకంగా, భౌగోళికంగా అనుకూలతలపరంగా ఎన్నో కలిసివచ్చే అంశాల సమాహారంగా ఉంది. అంతేకాక ఇటీవల సాధించిన 'లీగల్ పర్సనాలిటీ' ధృవీకరణ వల్ల తన చర్యలు అధీకృతమయ్యే సౌలభ్యం దృష్ట్యా కూడా ఈ కూటమి ప్రభావవంతంగా వ్యవహరించగలిగే లక్షణాన్ని సొంతం చేసుకుంది. ఇక కావల్సింది సభ్యదేశాల్లో కూటమి సాఫల్యం దిశగా అంకితభావం మాత్రమే. కూటమిలో అతిపెద్ద ఆర్థికవ్యవస్థ, అత్యంత ప్రయోజనం పొందగల దేశమైన భారత్‌పై ఈ కూటమి పరిరక్షణ బాధ్యతలు ఒకింత ఎక్కువగానే ఉన్నాయని చెప్పవచ్చు.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

దొంగచాటుగా అమెరికాకు హరీశ్‌రావు

- ఎస్‌ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావును కలిశారు
- ఇప్పట్లో తెలంగాణకు రావద్దని చెప్పి వచ్చారు
- ట్యాపింగ్ కేసులో కేసీఆర్ జైలుకెళ్లడం ఖాయం
- మీడియాతో టీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ సూచన మేరకు గత నెల 27న ఎమిరేట్స్ విమానంలో దొంగచాటుగా అమెరికా వెళ్లిన మాజీ మంత్రి హరీశ్‌రావు.. అక్కడే ఉన్న ఎస్‌ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావును కలిశారని ఆ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. ఇప్పట్లో తెలంగాణకు రావద్దని ఆయనకు చెప్పి వచ్చారని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్‌రావు అప్రూవర్‌గా మారితే తాను, తన కొడుకు కేటీఆర్ జైలుకు వెళ్లాల్సి వస్తుందన్న భయంతో కేసీఆరే హరీశ్‌రావును అమెరికా పంపారని తెలిపారు. 27వ తేదీ తెల్లవారు జామున 4.30గంటలకు ఎమిరేట్స్ విమానం(ఈకే 525)లో కుటుంబ సమేతంగా అమెరికా వెళ్లిన హరీశ్‌రావు.. శనివారం ఉదయం తిరిగి వచ్చారని పేర్కొన్నారు. ఒక ప్రజాప్రతినిధి విదేశాలకు వెళ్లే ముందు మీడియాకు వెల్లడించడం ఆనవాయితీ అని, కానీ.. హరీశ్ అమెరికా వెళ్లి వచ్చిన సంగతి ఎవరికైనా తెలుసా? అని ప్రశ్నించారు. ప్రభాకర్‌రావును హరీశ్ కలిసినప్పుడు అక్కడ బయట ఉన్న వాళ్లే తనకు ఈ విషయం చెప్పారన్నారు. హరీశ్‌కు దమ్ముంటే అమెరికా వెళ్లి ప్రభాకర్‌రావును కలవలేదంటూ ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆదివారం మంత్రి కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడారు. అధికారులతో ఫోన్ ట్యాపింగ్‌లు చేయించి... తెలంగాణను కేసీఆర్ నవ్వుల పాలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలు, మీడియా యాజమాన్యాలు, వ్యాపారుల ఫోన్లను ట్యాప్ చేసి, రూ.వేల కోట్లు వసూళ్లు చేశారని ఆరోపించారు. ప్రభాకర్‌రావును పట్టుకునేందుకు రెడ్ కార్నర్ నోటీసు జారీ చేయాలని నెల క్రితం కేంద్రానికి లేఖ రాసినా, స్పందన రాలేదని వెల్లడించారు. బీజేపీ, బీఆర్‌ఎస్ మిలాఖత్ అయినందునే స్పందించడం లేదని ఆరోపించారు. ఇవాళ కాకుంటే రేపైనా కేంద్రంపై ఒత్తిడి తెచ్చి అనుమతి తెచ్చుకుని రెడ్ కార్నర్ నోటీసు జారీ చేస్తామని, ప్రభాకర్‌రావును రాష్ట్రానికి తీసుకొస్తామని చెప్పారు. ఆ తర్వాత చట్టం తన పని తాను చేసుకుపోతుందని, కేసీఆర్, హరీశ్‌రావులు ఎక్కడ ఉంటారో తనకు తెలియదన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసు రుజువైతే ఏడేళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా ఈ దొంగచాటు వ్యవహారం పక్కన పెట్టి.. తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని కేసీఆర్‌కు సూచించారు.

4వ తేదీ తర్వాత బీఆర్‌ఎస్ క్లోజ్

ఈ నెల 4న లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత బీఆర్‌ఎస్ దుకాణం మూతపడబోతుందని, 16 స్థానాల్లో బీఆర్‌ఎస్‌కు డిపాజిట్లు కూడా రావని మంత్రి కోమటిరెడ్డి జోస్యం చెప్పారు. లోపాయికారి ఒప్పందంలో భాగంగా ఒకటి, రెండు తప్ప అన్ని లోక్‌సభ నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ నేతలు.. బీజేపీకి ఓట్లు వేయించారని ఆరోపించారు. అందుకే తెలంగాణలో 9 నుంచి 11 సీట్లు వస్తాయంటూ బీజేపీ నేతలు ధీమాగా ఉన్నారన్నారు. కానీ, అదంతా జరిగే పని కాదని, కాంగ్రెస్‌కు కనీసం 12 సీట్లు వస్తాయని చెప్పారు. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో ఎక్కువ మంది ప్రజాప్రతినిధుల బలం ఉండడం వల్లే బీఆర్‌ఎస్ గెలిచిందని పేర్కొన్నారు. కేసీఆర్‌లాగా ప్రజాప్రతినిధులను సంతలో పశువుల్లా కొనే చిల్లర పార్టీ కాంగ్రెస్ కాదని అన్నారు. బీఆర్‌ఎస్ నాయకుల దగ్గర దోచుకున్న డబ్బులు ఉన్నందునే.. క్యాంపులు పెట్టి గెలిచారన్నారు.

వేధించి.. విముక్తి

తప్పు చేయకున్నా పీఆర్ ఇంజనీర్లు విలవిల

- టీడీపీ నేతలకు బిల్లులు ఎగ్గొట్టేందుకు వైసీపీ సర్కారు ఐదేళ్లుగా కక్షసాధింపు
- తనిఖీలు, కేసులతో ఇంజనీర్లు హడల్
- దాదాపు 800 మందిపై కేసుల బనాయింపు
- ఐదేళ్లూ వేధించి ఇప్పుడు ఉపశమనం
- వాళ్లకేదో మేలు చేసినట్లు సర్కారు బిల్డప్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత ప్రభుత్వంలో సిమెంటు రోడ్లు వేసిన టీడీపీ నేతలకు బిల్లులు ఎగ్గొట్టేందుకు వైసీపీ సర్కారు పంచాయతీరాజ్ ఇంజనీర్లను బలిపశువుల్ని చేసింది. ఈ శాఖలో 2 వేలమందికి పైగా ఇంజనీర్లు ఉండగా, దాదాపు 800 మందిపై కేసులు పెట్టించింది. ఐదేళ్లూ రకరకాల తనిఖీలు, కేసులతో వేధించి చివరకు ఎన్నికల సమయంలో విముక్తి లభించింది. ఒక మనిషిని కొట్టి గాయం చేసి, ఆ దెబ్బకు మందు వేసి ఉపశమనం కలిగించినట్టుగా పంచాయతీరాజ్ ఇంజనీర్ల పరిస్థితి తయారైంది. గత ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా ఉపాధి హామీ పథకం మెటీరియల్ నిధులతో 10 వేల కిలోమీటర్ల మేర సిమెంట్ రోడ్లు వేసి చరిత్ర సృష్టించారు. వైసీపీ సర్కారు రాగానే.. అభివృద్ధి చేయడమే తప్పన్నట్టుగా పంచాయతీరాజ్ ఇంజనీర్లకు చుక్కలు చూపించింది. ఈ ప్రభుత్వంలోని బాధితుల్లో మొదటి స్థానం వారిదే. ఇంజనీర్లపై విజిలెన్స్ కేసులు పెట్టారు. కొంత మందిపై ఏసీబీ కేసులు కూడా నమోదు చేశారు. దీంతో పలువురు ఇంజనీర్లు తీవ్ర మానసిక క్షోభ అనుభవించారు. కొందరు రోగాల బారినపడ్డారు. మరికొందరు మానసిక క్షోభతో మరణించారు. ఇంజనీర్ల నిరవధిక పోరాటంతో ఎట్టకేలకు ప్రభుత్వం తలొగ్గి విజిలెన్స్ కేసులను వెనక్కి తీసుకుంది. విముక్తి పొందిన వారిలో రెండు, మూడేళ్లలో రిటైర్ కాబోతున్న ఇంజనీర్లు కూడా ఉన్నారు. పనుల్లో అవకతవకలు జరగకపోయినా టీడీపీకి చెందిన మాజీ సర్పంచ్‌లకు బిల్లులు ఎగ్గొట్టేందుకు తమను వేధించారని ఇంజనీర్లు వాపోతున్నారు. మిగిలిన జిల్లాలకు చెందిన ఇంజనీర్లపై కేసులు అలాగే ఉన్నాయి.

జవహర్ హయాంలోనే...

ప్రస్తుత సీఎస్ జవహర్‌రెడ్డి గత ప్రభుత్వంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శిగా ఉన్నారు. ఆ సమయంలోనే సిమెంటు రోడ్లు వేశారు. వాస్తవానికి గత ప్రభుత్వంలో పనులు చేపట్టేందుకు తగినంతమంది సిబ్బంది లేరు. ఇంత భారీ స్థాయిలో పనులు చేపట్టలేమని అప్పట్లో ఇంజనీర్లు నిస్సహాయత వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి వచ్చే ఉపాధి నిధులు సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరముందని, ఇందుకు సహకరించాలని అప్పట్లో ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు ఇంజనీర్లను ఒప్పించారు. ఇంజనీర్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చేస్తామని జవహర్‌రెడ్డి కూడా వారికి భరోసా ఇచ్చి ఒప్పించారు.

బిల్లులు ఎగ్గొట్టేందుకు...

చంద్రబాబు ప్రభుత్వంలో ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో పెద్దఎత్తున సిమెంటు రోడ్లు నిర్మించారు. ఈ పనులు చేపట్టిన అప్పటి సర్పంచ్‌లకు బిల్లులు చెల్లించే లోపే ప్రభుత్వం మారింది. వైసీపీ సర్కారు వచ్చాక కక్షపూరిత వైఖరితో సర్పంచ్‌లకు బిల్లులు ఎగ్గొట్టేందుకు చేయని ప్రయత్నమంటూ లేదు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి నిధులు ఇచ్చినా.. పంచాయతీలకు బిల్లులు ఇవ్వకుండా ఇతర అవసరాలకు వాడుకుంది. దీంతో పదవీకాలం ముగిసిన సర్పంచ్‌లు కోర్టును ఆశ్రయించారు. ఆ పనుల్లో అవకతవకలు జరిగాయని కోర్టును మభ్యపెట్టేందుకు ప్రభుత్వం ఇంజనీర్లను పావుల్ని చేసింది. ఇంజనీర్లను టార్గెట్ చేసేలా విజిలెన్స్ అధికారులతో తనిఖీలు చేయించింది. అంతటితో ఆగకుండా కొన్నిచోట్ల ఏసీబీ తనిఖీలకు కూడా పురమాయించింది. గతంలో చేపట్టిన పనులపై విచారణ చేపడుతున్నామని, నివేదిక వచ్చిన తర్వాత బిల్లులు చెల్లిస్తామని ఏడాది పాటు హైకోర్టును ప్రభుత్వం మభ్యపెట్టింది. ఈ పనుల్లో ఉపాధి నిధులు మిళితమైనందున ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు మూడు రకాల తనిఖీలు నిర్వహించారు. క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనిఖీలు చేసి నాణ్యతను పరిశీలించారు. ఎక్కడైనా లోపాలుంటే జరిమానాలు విధించారు. వారితో పాటు సోషల్ ఆడిట్ సిబ్బంది కూడా ఈ పనులను పరిశీలించారు. అంతేగాక ఇతర శాఖల ఇంజనీర్లను నియమించి తనిఖీలు చేపట్టారు. జిల్లా కలెక్టర్లు పంపిన వివరాల్లో పనులకు సంబంధించి అసంపూర్ణ సమాచారముందని ప్రణాళిక శాఖ అధికారులు భావించారు. సుమారు 5,679 పనులకు అగ్రిమెంట్ నంబర్ వేయలేదని, 263 పనులకు ఎంబుక్స్ నంబర్లు లేవని, 698 పనులకు రికార్డింగ్ తేదీలు వేయలేదని, 712 పనుల్లో చెక్ మెజర్‌మెంట్ తేదీలు సూచించలేదని, 1124 పనులకు సంబంధించి అగ్రిమెంట్ చేసిన పని కంటే ఎక్కువ చేశారని కలెక్టర్లు ఇచ్చిన నివేదిక ద్వారా గుర్తించినట్లు చెప్పారు. ఈ పనులన్నింటిపై సమగ్రంగా విచారణ చేపట్టి నాణ్యతను పరిశీలించి నివేదిక ఇవ్వాలని ప్రణాళిక శాఖ కార్యదర్శి అప్పట్లో ఓ లేఖ ద్వారా విజిలెన్స్‌ను కోరారు. టీడీపీకి చెందిన మాజీ సర్పంచ్‌లకు బిల్లులు చెల్లించరాదన్న మొండి పట్టుదలతో ఉన్న ప్రభుత్వం విజిలెన్స్, ఏసీబీ విచారణకు ఆదేశించడంతో ఇంజనీర్లకు కంటి మీద కునుకు కరువైంది. చర్యలు తీసుకోవాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ఉపాధి హామీ పథకం మెటీరియల్ పనుల్లో జరిగిన అవకతవకలపై విచారణ చేయడానికి వాటికి సంబంధించిన డాక్యుమెంట్లను సిద్ధంగా ఉంచాలని ఏసీబీ అధికారులు పంచాయతీరాజ్ ఉన్నతాధికారులకు లేఖ రాశారు.

ఇంజనీర్లు బెంబేలు

వైసీపీ ప్రభుత్వంలో వరుస తనిఖీలతో పంచాయతీరాజ్ ఇంజనీర్లు బెంబేలెత్తిపోయారు. టీడీపీ నేతలకు బిల్లులు ఎగ్గొట్టేందుకు విచారణ పేరిట ఇంజనీర్లను వేధించారు. తప్పులు జరగకపోయినా విచారణ చేపట్టడమేంటని గత ప్రభుత్వంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శిగా ఉన్న ప్రస్తుత సీఎస్ జవహర్‌రెడ్డికి ఇంజనీర్లు మొరపెట్టుకున్నారు. మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ముత్యాలనాయుడిని పలుమార్లు బతిమాలాల్సిన దుస్థితి ఏర్పడింది. ఓ వైపు తనిఖీలతో హడలిపోగా.. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బుడితి రాజశేఖర్ ఈ కేసును బూతద్దంలో చూడటంతో ఇంజనీర్ల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. చివరకు పెద్దిరెడ్డి, ముత్యాలనాయుడు జోక్యం చేసుకోవడంతో ఇంజనీర్లపై కేసులు ఎత్తేస్తున్నట్లు ఆదేశాలిచ్చారు. టీడీపీ నేతలకు బిల్లులు నిలిపేసేందుకు ఇంజనీర్లను వేధించిన వైసీపీ సర్కారు చివరకు వారిపై విజిలెన్స్ కేసులు ఎత్తేసి మేలు చేశామంటూ ఇదేదో ఘన కార్యంగా చెబుతోంది. ఎన్నికల సమయంలో ఉన్నతాధికారులకు మంత్రి పెద్దిరెడ్డి ఫోన్ చేసి ఇంజనీర్లకు హామీ ఇచ్చామని, వారిపై ఎలాంటి విజిలెన్స్ కేసులు లేకుండా చేయాలని సూచించారు. దీంతో మంత్రి తమకు సాయం చేశారంటూ ఇంజనీర్ల సంఘాలు కృతజ్ఞతలు చెప్పాయి. క్షేత్రస్థాయి ఇంజనీర్లు మాత్రం తమను అకారణంగా విజిలెన్స్ కేసుల్లో ఇరికించి, ఇప్పుడు మేలు చేసినట్టు వైసీపీ సర్కారు బిల్డప్ ఇస్తోందని విమర్శిస్తున్నారు.

గ్రామదేవత జాతరలో విషాదం

- ట్రాక్టర్‌కు తగిలిన విద్యుత్ తీగలు.. ఇద్దరు మృతి




పల్లకీకి తగిలిన విద్యుత్ తీగలు

బెంగళూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): గ్రామ దేవత జాతరలో పల్లకీ ఉత్సవంలో విషాదం నెలకొంది. పల్లకీని తీసుకువస్తున్న ట్రాక్టర్‌కు విద్యుత్ షాక్ తగలడంతో ఇద్దరు భక్తులు మృతి చెందారు. బెంగళూరు శివారులోని ఎలక్ట్రానిక్ సిటీకి అనుబంధమైన గొల్లహళ్లిలో శనివారం రాత్రి జరిగిన ఈ ప్రమాదంలో వీరసంద్ర నివాసి రంగనాథ్ (33), యరండహళ్లి నివాసి హరిబాబు (25) ప్రాణాలు కోల్పోయారు. గొల్లహళ్లిలో గ్రామ దేవత జాతరలో భాగంగా పల్లకీ ఉత్సవం నిర్వహించారు. ఉత్సవం ముగిసి తిరిగి వస్తుండగా పల్లకీకి విద్యుత్ తీగలు తగిలాయి. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్‌కు విద్యుత్ షాక్ తగిలింది. అతన్ని రక్షించేందుకు వెళ్లిన మరో వ్యక్తికీ షాక్ తగిలింది. తీవ్రంగా గాయపడిన వారిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందారు. ఈ మేరకు ఎలక్ట్రానిక్ సిటీ పోలీసులు కేసు నమోదు చేశారు.

టెరిటోరియల్ ఆర్మీలో చేరిన భవ్య

- కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా గుర్తింపు



బెంగళూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ కర్ణాటక రాష్ట్ర అధికార ప్రతినిధి, సోషల్ మీడియా విభాగంలో కీలకంగా వ్యవహరిస్తున్న భవ్య నరసింహమూర్తి టెరిటోరియల్ ఆర్మీలో చేరారు. కొన్నేళ్లుగా కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా మాత్రమే పరిచయం ఉన్న భవ్య ప్రస్తుతం ఆర్మీలో లెఫ్టినెంట్ హోదా పొందారు. టెరిటోరియల్ ఆర్మీలో చేరినట్టు సోషల్ మీడియాలో ఆమె ఆదివారం వెల్లడించారు. దక్షిణాది నుంచి ఎంపికైన తొలి మహిళ, ప్రాంతీయ సైన్యాధికారిగా, లెఫ్టినెంట్‌గానూ భవ్య నరసింహమూర్తి నిలిచారు. 2022లో డైరెక్టరేట్ జనరల్ టెరిటోరియల్ ఆర్మీ నిర్వహించిన పరీక్షల్లో ఏకైక మహిళా ప్రాంతీయ సైనిక అధికారి అనే గౌరవానికి ఎంపికయ్యారు. ప్రాంతీయ సైన్యం అంటే రెగ్యులర్ ఆర్మీ కాదు. దేశపౌరులు తమ వృత్తితో పాటు సైన్యంలో భాగమై దేశసేవ చేసే అవకాశాన్ని కల్పిస్తారు. టీమిండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోని, పారాచూట్ రెజిమెంట్ ప్రాంతీయ సైనిక అధికారిగా వ్యవహరించారు. రాజస్థాన్‌కు చెందిన సచిన్ పైలెట్, బీజేపీకి చెందిన అనురాగ్ ఠాకూర్ కూడా టెరిటోరియల్ ఆర్మీలో చేరి గుర్తింపు పొందారు. ఏడాదికి రెండు నెలలపాటు టెరిటోరియల్ ఆర్మీలో విధులు నిర్వహిస్తారు. రాష్ట్ర ప్రజలు ఆశీస్సులు అందించాలని ఆమె సోషల్ మీడియా ద్వారా ఆకాంక్షించారు. భవిష్యత్తులో రాజకీయాల్లో దేశసేవ చేయదలిచానని, అంతకంటే ముందు దేశ సరిహద్దులో సేవ చేసే భాగ్యం లభించిందని పేర్కొన్నారు. 2024 మే నెలలో ఇండో-పాక్ ఎల్‌ఓసీ (నియంత్రణ రేఖ) వద్ద ఉండే శిబిరంలో శిక్షణ పొందానని భవ్య వెల్లడించారు.

నేడు రౌస్ అవెన్యూ కోర్టుకు కవిత

- కస్టడీ పొడిగించాలని కోరనున్న దర్యాప్తు సంస్థలు!

న్యూఢిల్లీ, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయి తిహాడ్ జైల్లో ఉన్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను సోమవారం ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపర్చనున్నారు. జ్యుడీషియల్ కస్టడీ ముగియనుండడంతో ఆమెను కోర్టు ఎదుట హాజరు పరచనున్నారు. కవితతోపాటు చరణ్‌ప్రీత్, దామోదర్ శర్మ, ప్రిన్స్ కుమార్, అరవింద్ సింగ్‌లను నిందితులుగా పేర్కొంటూ రౌస్ అవెన్యూ కోర్టులో ఈడీ వేసిన అనుబంధ చార్జిషీట్‌ను గత నెల 29న న్యాయమూర్తి అంగీకరిస్తూ నిర్ణయం తీసుకున్నారు. కవిత, చరణ్‌ప్రీత్‌లు ఇప్పటికే జ్యుడీషియల్ కస్టడీలో ఉండడంతో వారికి న్యాయస్థానం ప్రొడక్షన్ వారెంట్లు జారీ చేసింది.



వెంకటపాలెం శిబిరంలో బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్న మహిళలు

అక్కడ సంబరాలు.. ఇక్కడ శోకాలు

● రాజధాని లేని రాష్ట్రంగా మార్చిన జగన్‌రెడ్డి

● 1629వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

తుళ్లూరు, జూన్ 2: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాలు వాళ్లు జరుపుకొంటుంటే, సీఎం జగన్‌రెడ్డి మూడు ముక్కలాటతో రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసి, ఆంధ్రప్రదేశ్ ప్రజలకు శోకాన్ని మిగిల్చారని రాజధాని అమరావతి నిర్మాణానికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ మూడు రాజధానులకు వ్యతిరేకంగా రైతులు, మహిళలు, రైతు కూలీలు ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుంచి చేస్తున్న ఆందోళనలు నిరసన దీక్షలు ఆదివారం నాటికి 1629వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడారు. లక్షల కోట్ల రాష్ట్ర సంపద అమరావతిని నాశనం చేసిన సీఎం జగన్‌రెడ్డిని ప్రజలు ఈ ఎన్నికలలో ఇంటికి పరిమితం చేయబోతున్నారన్నారు. పక్క రాష్ట్రం అభివృద్ధి వైపు పయనిస్తుంటే ఆంధ్రప్రదేశ్‌ని అప్పుల ఊబిలోకి నెట్టారన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఏపీ అట్టడుగుకు పోయిందన్నారు. రాజధానిని నాశనం చేయాలనుకున్న వారు ప్రజా ద్రోహులని పేర్కొన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాల్లో ఆందోళనలు నిరసనలు కొనసాగాయి.

భారీ సీట్లతో కూటమి గెలివాలని హోమం



కూటమి విజయం సాధించి చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని మందడంలో రాజశ్యామల హోమాలు చేస్తున్న రాజధాని రైతులు, మహిళలు

తుళ్లూరు, జూన్ 2: భారీ సీట్లతో కూటమి అభ్యర్థులు గెలిచి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని, రాజధాని అమరావతి రైతులు మందడం పోలేరమ్మ అమ్మవారి ఆలయ ఆవరణలో రాజశ్యామల హోమం ఆదివారం నిర్వహించారు. తొమ్మిదిమంది దంపతులతో ఉదయం 10.30గంటలకు ఈ హోమాలు ప్రారంభించారు. చండీయాగం కూడా నిర్వహించారు. హోమాలలో పూర్ణాహుతి సమర్పించి కూటమి విజయం సాధించాలని సీఎంగా చంద్రబాబు నాయుడు తిరిగి ముఖ్యమంత్రి కావాలని వేడుకున్నారు. చంద్రబాబు నేతృత్వంలో అమరావతి పూర్తిస్థాయిలో అభివృద్ధి సాధించి రాష్ట్రాభివృద్ధికి తోడ్పడాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీసీ బెజవాడ నరేంద్ర, రైతు జేఏసీ నాయకులు శ్యాంకిషోర్, కండెపాటి సతీష్,చంద్ర,పువ్వాడ సురేంద్ర,అనుమోలు గణేష్, ఆలూరి శ్రీనివాసరావు, ధనేకుల సుబ్బారావు, ఆలూరి మణి పూర్ణ, పేరారం రామారావు, రాజధాని రైతులు, మహిళలు రైతు కూలీలు పాల్గొన్నారు.

కౌంటింగ్ ఏజెంట్లు అనుక్షణం అప్రమత్తంగా వుండాలి

● కొమ్మారెడ్డి పట్టాభిరామ్



కౌంటింగ్ ఏజెంట్ల శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న పట్టాభిరామ్

గుంటూరు, జూన్2 (ఆంధ్రజ్యోతి): కౌంటింగ్ ఏజెంట్లు కౌంటింగ్ హాల్లో ప్రవేశించింది మొదలు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని, ఏమాత్రం ఏమరుపాటుగా ఉండకూడదని టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ హెచ్చరించారు. గుంటూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్ అధ్యక్షతన ఆదివారం జోన్- 3 పరిధిలోని కూటమి అభ్యర్థుల కౌంటింగ్ ఏజెంట్లకు పోస్టల్ బ్యాలెట్ శిక్షణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పట్టాభిరామ్, ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణరాజు, మాజీ శాసనసభ్యులు యామినీబాల, మంతెన రామరాజు హాజరయ్యారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, జిల్లా అధికార ప్రతినిధి దామచర్ల శ్రీనివాసరావు, నగర ప్రధాన కార్యదర్శి ముత్తినేని రాజేష్‌లు కౌంటింగ్ ఏజెంట్లకు శిక్షణను అందించారు. ఈ సందర్భం గా పట్టాభిరామ్ మాట్లాడుతూ కౌంటింగ్ రోజున పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ఏజెంట్లు ఫారం 18, గుర్తింపుకార్డు తీసుకొని 6 గంటలకల్లా కౌంటింగ్ హాలుకి చేరుకొని నిర్ణయించిన టేబుల్‌లో కూర్చోవాలన్నారు. కౌంటింగ్ ఏజెంట్లు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ఫార్మాట్- 1 తమ దగ్గర ఉంచుకోవాలని, అలాగే ఆర్వో ఇచ్చే నియోజకవర్గం మొత్తంగా పోలైన పోస్టల్‌బ్యాలెట్ ఓటింగ్ ఫార్మాట్ -2 కూడా దగ్గర ఉంచుకోవాలని చెప్పారు. ఎలక్ట్రానిక్ ట్రాన్స్‌మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ సిస్టమ్ (ఈటీపీబీఎస్) ద్వారా సర్వీస్ ఓట్లను కౌంటింగ్ ప్రారంభమయ్యే అరగంట ముందువరకు కూడా తీసు కుంటారని, ఆ ఓట్లకు సంబంధించిన కాపీ ఆర్వో దగ్గర ఏజెంట్లు తీసుకోవాలని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్‌కి సంబంధించి 13సి అనే పెద్ద ఎన్వలప్‌లో అనే డిక్లరేషన్ ఫారం 13ఏ, బ్యాలెట్‌తో కూడిన చిన్న ఎన్వలప్ 13బీ ఉంటాయని, 13సీ ఎన్వలప్ కవర్ సీల్ సక్రమంగా ఉందా లేదా అని పరిశీలించుకోవాలని, ఒకవేళ కవర్ సీల్ తెరచి ఉన్నట్లయితే వెంటనే ఆర్వోకి ఫిర్యాదు చేయాలని చెప్పారు. 13సీ ఎన్వలప్ మీద ఓటర్ సంతకం చేసినా చేయక పోయినా ఓటు చెల్లుతుందన్నారు. తరువాత 13ఏ డిక్లరేషన్ ఫారం మీద బ్యాలెట్ పేపర్ సీరియల్ నెంబరు ఉందా లేదా అని గమనించుకోవాలని, అదే సీరియల్ నెం 13బి బ్యాలెట్ ఎన్వలప్ మీద కూడా ఉండాలని, లేకపోతే ఓటు చెల్లదని చెప్పారు. 13ఏ డిక్లరేషన్ ఫారంలో ఓటర్ ఓటరు సంతకం లేకపోతే ఓటు చెల్లదని చెప్పారు. కౌంటింగ్ ఏజెంట్లు పోస్టల్ బ్యాలెట్ 13సీ, 13ఏ, 13బీలోని వివరాలు సరిగా ఉన్నాయా లేదా అని గమనించుకోవాలన్నారు. తెనాలి శ్రావణ్ కుమార్ మాట్లా డుతూ పోస్టల్ ఎక్కువ సమయం తీసుకునే అవకాశం ఉన్న పోస్టల్‌బ్యాలెట్ ఓట్లు లెక్కింపు సమయం లో ఏజెంట్లు ఎంతో సంయమనంతో ఓట్లు లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యే వరకు అప్రమ త్తంగా ఉండాలన్నారు. ఓట్ల పరిశీలనలో కానీ, లెక్కింపులో కానీ ఏజెంట్లకు ఏదైనా అభ్యంతరాలు ఉంటే ఆర్వో లేదా అబ్జర్వర్ దృష్టికి లిఖితపూర్వకంగా తీసుకెళ్లాలని తెలి పారు. దామచర్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ కౌంటింగ్ జరిగేటప్పుడు బూత్‌ల వారీగా ఈవీఎం మిషన్ నెంబర్లను, అలాగే పోలైన ఓట్లను తప్పకుండా సరిచూసుకోవాలన్నారు. టెక్నికల్‌గా ఎలాంటి అనుమానం వచ్చినా వెంటనే చీఫ్ ఏజెంట్ లేదా అబ్జర్వ ర్‌కు తెలియజేయాలన్నారు. వైసీపీ ఏజెంట్లు కావాలనే రెచ్చగొట్టేలా వ్యవహరించే అవకాశం ఉందని, అలాంటి సందర్భాల్లో సంయమ నం పాటించడంతోపాటు అప్రమత్తంగా వ్యవహరించాలని చెప్పారు. సమావేశంలో కంచర్ల శివరామయ్య, బొబ్బిలి రామారావు తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ రోజు హింసకు తాడేపల్లి కుట్రలు



ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, జూన్ 2: రాష్ట్రంలో కౌంటింగ్ రోజు హింస రాజేసేందుకు తాడేపల్లి ప్యాలెస్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి కుట్రలు చేస్తున్నారని మాజీ మంత్రి, చిలకలూరిపేట కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం తన నివాసంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటమి తప్పనిసరి పరిస్థితుల్లో అల్లర్లకు దిగాలని ముందు నుంచే దురాలోచనల్లో ఉన్న వైకాపా ఎగ్జిట్ పోల్స్ అంచనాల తరువాత ఆ కుట్రలకు మరింత పదును పెడుతుందన్నారు. కూటమి ఘన విజయంతో పాటు తెలుగుదేశం ఒంటరిగానే సాధారణ ఆధిక్యాన్ని అందుకోనున్నందున అంచనాలను వైకాపా సీఎం జగన్‌రెడ్డి జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. ఏజెంట్లను రెచ్చగొట్టేలా వాఖ్యలు చేసిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిపై నమోదైన కేసుల్లో వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. వాదనలకు దిగాలని, ఘర్షణకు దిగాలని వైకాపా అధిష్ఠానం నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్న నేపథ్యంలో వారి కౌంటింగ్ ఏజెంట్ల పైన రిటర్నింగ్ అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇదే సమయంలో పోస్టల్ బ్యాలెట్లపై హైకోర్టు చెంప పెట్టులాంటి తీర్పు ఇచ్చినా వైసీపీ కుట్రలు మాత్రం మానుకోలేదన్నారు. మొదటి నుంచి ఓటమి భయంతోనే ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఓట్లు వేయకుండా అడ్డుకోవాలని చూశారని, అది సాధ్యంకాక పోవటంతో ఇప్పుడు వాటిని చెల్లకుండా చెల్లకుండా చేయాలని కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని మండి పడ్డారు. ఉద్యోగ వర్గాల్లో 90 శాతం ఓట్లు కూటమికి అనుకూలంగా పడ్డాయి అన్న అంచనాలే అందుకు కారణం అన్నారు. జూన్ 4వ ఫలితాలు అనంతరం చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయటం తథ్యం అన్నారు. ఎగ్జిపోల్స్ ఫలితాలను మించిన ఆధిక్యంతో కూటమి గెలవబోతుందని, రాష్ట్ర ప్రజలు ఎంత బలంగా మార్పు కోరుకున్నారో ఈ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయన్నారు.

పిడుగుపాటుకు ఇద్దరు రైతులు మృతి





పిడుగుపాటుకు మృతిచెందిన పెద్ది చినవీరయ్య, చిరతల శ్రీనివాసరావు

ఉన్నవ(యడ్లపాడు), జూన్ 2: పిడుగు పడి ఇద్దరు రైతులు మృతిచెందిన ఘటన పల్నాడుజిల్లా యడ్లపాడు మండలం ఉన్నవ గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన పెద్ది చినవీరయ్య(53), చిరతల శ్రీనివాసరావు(50) ఆదివారం తెల్లవారుజామున చెరో ట్రాక్టరుతో గ్రామం పరిధిలోని ఆచార్య చెరువు సమీపంలోగల పొలం దున్నేందుకు వెళ్ళారు. పొలం దున్నుతున్న సమయంలో పెద్దగా ఉరుములు, మెరుపులతో వర్షం రావడంతో ఇద్దరూ ట్రాక్టర్లు దిగి సమీపంలోని వేప చెట్టు క్రిందకు చేరారు. అదే సమయంలో వారు నిలుచున్న చెట్టుపై పిడుగు పడి ఇరువురు అక్కడికక్కడే మృతిచెందారు. చినవీరయ్యకు భార్య రాజేశ్వరి, కుమారుడు, కుమార్తె ఉండగా, శ్రీనివాసరావుకు భార్య వీరమ్మ, కుమార్తె, కుమారుడు ఉన్నారు. గ్రామస్తుల ద్వారా సమాచారం అందుకున్న రెవెన్యూ, పోలీసు అధికారులు సంఘటన ప్రాంతానికి చేరుకుని వివరాలు నమోదుచేసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఏపీ చాంబర్స్ సెంట్రల్ జోన్ చైర్‌పర్సన్‌గా సక్కు మాధవి

విజయవాడ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ (ఏపీ చాంబర్స్) సెంట్రల్ జోన్ మహిళా పారిశ్రామికవేత్త విభాగం ఆదివారం ఏర్పాటైంది. గుంటూరులోని ఓ హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు మహిళా విభాగాన్ని ఎన్నుకున్నారు. ఏపీ చాంబర్స్ తరఫున మొదటిసారిగా 2021లో విశాఖపట్నంలో మహిళా విభాగాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం ఈ విభాగంలో 100 మంది మహిళా పారిశ్రామికవేత్తలు సభ్యులుగా ఉన్నారు. దాదాపు రెండున్నరేళ్లుగా విశాఖ ప్రాంతంలోని మహిళా పారిశ్రామికవేత్తలకు మద్దతుగా ఈ విభాగం పనిచేస్తోంది. ఇదే క్రమంలో గుంటూరుతో పాటు పొరుగు జిల్లాలకు చెందిన మహిళా పారిశ్రామికవేత్తలతో సెంట్రల్ జోన్ మహిళా పారిశ్రామికవేత్తల విభాగం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏపీ చాంబర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు మాట్లాడుతూ రాష్ట్ర సుస్థిర అభివృద్ధికి, లింగ సమానత్వం, పేదరిక నిర్మూలన కోసం ఆర్థిక రంగంలో కూడా మహిళలను భాగస్వాములను చేయాలన్నారు. దేశంలో మహిళల ఆర్థిక సహకారం చూస్తే జీడీపీలో 17 శాతం మాత్రమే ఉందన్నారు. ఇది ప్రపంచ సగటు కంటే చాలా తక్కువ అన్నారు. వర్క్‌ఫోర్స్‌లో 50 శాతం మంది మహిళలను చేర్చుకోవటం వల్ల జీడీపీ వృద్ధిని 1.5 శాతం పెంచుకోవటం జరుగుతుందని ప్రపంచ బ్యాంక్ నివేదించిందని గుర్తుచేశారు. మెకిన్సే గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ (ఎంజీఐ) అంచనా ప్రకారం 2025 నాటికి 68 మిలియన్ల మంది మహిళలను శ్రామికశక్తిలోకి తీసుకురావటం ద్వారా భారతదేశం తన జీడీపీని 700 బిలియన్ల డాలర్లకు పెంచుకుంటుందని అంచనా వేసిందన్నారు. అనంతరం సెంట్రల్ జోన్ మహిళా పారిశ్రామికవేత్తల విభాగం చైర్‌పర్సన్‌గా సక్కు మాధవి, వైస్ చైర్‌పర్సన్‌గా రాయపాటి మమత బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి విజ్ఞాన్ యూనివర్సిటీ చైర్మన్ లావు రత్తయ్య హాజరయ్యారు. ఏపీ చాంబర్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఎల్.రఘురామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, మహిళా పారిశ్రామికవేత్తల విభాగం చైర్‌పర్సన్ వై.గీత శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేతల టోకరా!



దాచేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎరువుల షాపు వ్యాపారిపై ఫిర్యాదు చేయడానికి వచ్చిన ముత్యాలంపాడు గ్రామస్తులు

● ఎరువుల షాపు పేరుతో తొమ్మిది కోట్లు ఎగ్గొట్టిన వైనం

● బాకీలతో మాకు సంబంధం లేదని వైసీపీ నేత దుర్భాషలు

దాచేపల్లి: ఎరువుల షాపు పేరుతో జనం దగ్గర డబ్బులు తీసుకొని.. తోటి వాటాదారులు చనిపోవడంతో.. మిగిలిన వాటాదారుడు తమకు ఇవ్వాల్సిన తొమ్మిది కోట్ల బాకీలతో తనకు ఎటువంటి సంబంధం లేదని... అడిగితే బూతులు తిడుతున్నాడంటూ బాధితులు వాపోతున్నారు. ఆదివారం బాధితులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం ముత్యాలంపాడు గ్రామానికి చెందిన మాజీ చైర్మన్ గొట్టిముక్కల సుబ్బమ్మ కుమారుడు మత్తారెడ్డి, అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి, బాలినేడి వెంకటరెడ్డి కలసి గత కొన్ని ఏళ్లుగా ఎరువుల వ్యాపారం చేశారు. కాగా ఇటీవల శ్రీనివాసరెడ్డి, వెంకటరెడ్డి మృతి చెందారు. అయితే వారికి గ్రామానికి చెందిన పలువురు రైతులు నగదు వడ్డీకి ఇచ్చారు. వారు మృతి చెందడంతో... వారి తోటి వాటాదారుడు మత్తారెడ్డిని గ్రామస్తులు డబ్బులు విషయం అడిగారు. తనకు ఆ బాకీలతో ఎటువంటి సంబంధం లేదని అతను తెగేసి చెప్పాడు. బాకీ ఇచ్చిన రుణదాతలు అంతా చిన్నా సన్నకారు రైతులు. సిమెంట్ కర్మాగారంలో రోజు వారీ కూలీలు. మాకు తొమ్మిది కోట్ల నగదు రావాలి. రుణం ఇచ్చిన వారిలో 150 మందికి పైగా ఉన్నాం. వారు వైసీపీ నేతలు కావడంతో వారికి ఎదురు చెప్పేవారు లేరు. మేము కూడా వైసీపీ కార్యకర్తలమే కానీ మాకు న్యాయం జరగటం లేదు అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాధితులు దాచేపల్లి పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారు.

కూటమి ప్రభుత్వంతో రాష్ట్రానికి పూర్వ వైభవం

● ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్



రేపల్లె, జూన్ 2: రాష్ట్రంలో ఎగ్జిట్ పోల్స్ అన్నీ కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రావటం తథ్యమని చెప్పటం హర్షనీయమని, కూటమి ప్రభుత్వంతో రాష్ట్రంలో పూర్వవైభవం రానుందని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో అనగాని మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు రోజున వైసీపీ నాయకులు రెచ్చగొట్టే విధంగా అల్లర్లు సృష్టించే విధంగా కుటిల రాజకీయాలు చేస్తున్నారన్నారు. ఇప్పటికే ఉమ్మడి గుంటూరు జిల్లాలో వైసీపీ నాయకులు చేసిన అరాచకాలతో యావత్ దేశం నివ్వెరపోయిందన్నారు. ఐదేళ్ళ జగనాస్వర పాలన అంతమొందించే విధంగా ప్రజలు నిర్ణయం తీసుకున్నారని వైసీపీ పాలనలో ప్రజలు ఎవరు సంతోషంగా లేరని, రాష్ట్రాన్ని మూడు రాజధానుల పేరుతో దోచుకుతిన్నారన్నారు. రాజధాని లేని రాష్ట్రంగా చేసిన జగన్‌కు పరాభవం తప్పదన్నారు. సహజవనరులైన ఇసుక, మట్టి, జగనన్న కాలనీల భూకొనుగోలులో లక్షల కోట్లు దోచుకు తిన్నారన్నారు. అలాంటి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపనున్నారని కూటమి ప్రభుత్వం రావటం తథ్యమని అన్ని వర్గాల ప్రజలను ఆర్థికంగా బలపడే విధంగా పాలన అందివ్వటం రాష్ట్రాభివృద్ధి చెయ్యటమే ధ్యేయంగా ముందుకు వెళ్ళనున్నామని తెలిపారు. వైసీపీ నాయకుల రెచ్చగొట్టే ధోరణికి ఎవరు స్పందించవద్దని రెండురోజుల పాటు సమన్వయం పాటించాలని ప్రజలను కోరారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు పంతాని మురళీధరరావు, గూడపాటి శ్రీనివాసరావు, తాతా ఏడుకొండలు, కొలసాని రాము, ఎన్‌వీకే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాజధాని మహిళల శాపంతోనే వైసీపీ సమాధి

● నక్కా ఆనందబాబు



మాట్లాడుతున్న నక్కా ఆనందబాబు, కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): రాజధాని మహిళల శాపం, చంద్రబాబు కంటకన్నీరు, దళితు ల ఊచకోతతో వైసీపీ సమాధై పోయిందని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరోసభ్యుడు నక్కా ఆనందబాబు విరుచుకుపడ్డారు. గుంటూరులోని క్యాంపు కార్యాల యంలో ఆదివారం ఆయన విలేక రులతో మాట్లాడారు. మెజారిటీ ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలు తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా రావటం హర్షనీయమన్నారు. 151 సీట్లతో అధికారంలోకి వచ్చిన జగన్మోహనరెడ్డి నీరో చక్రవర్తిలా వ్యవహరించి, రాష్ట్రాన్ని అన్నీ రంగాల్లో అధోగ తిపాలు చేసాడని ఆనందబాబు విమర్శించారు. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని తుం గలో తొక్కి రాజారెడ్డి రాజ్యాంగాన్ని నడిపించారని అన్నారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన విదేశీ విద్యా పథకానికి అంబేడ్కర్ పేరును తొలగించిన నీచుడు జగన్ అని మండిపడ్డారు. అన్యాయాన్ని ప్రశ్నించిన దళితులపైనే ఎస్సీ ఎస్టీ చట్టాన్ని ప్రయోగించి జైలుకి పంపిన చరిత్ర హీనుడు జగన్ రెడ్డని అన్నారు. రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు రాకపోగా ఉన్న పరిశ్రమలను తరిమేసి రాక్షసానం దం పొందిన సైకో అని అన్నారు. టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనప ర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ చంద్రబాబు అసెంబ్లీలో శపథం చేసినరోజే జగన్ పతనం ప్రారంభమైందని, దేవాలయం లాంటి టీడీపీ రాష్ట్ర కార్యాలయం పై దాడి చేయటమేకాక చంద్రబాబుని వ్యక్తి గతంగా దూషించిన ఆకు రౌడీలందరికీ చక్రవడ్డీతో సహా తిరిగి చెల్లిస్తామని అన్నారు.



నరసరావుపేటలో ఏర్పాటు చేసిన పెదకూరపాడు కౌంటింగ్ కేంద్రాన్ని పెదకూరపాడు కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్, తదితరులు ఆదివారం పరిశీలించారు. - గుంటూరు (ఆంధ్రజ్యోతి)

శ్రీబగళాముఖి అమ్మవారికి

బంగారపు హారం సమర్పణ



దాత తోటకూర సాంబశివరావు అందజేసిన లక్ష్మీదేవి బంగారపు హారం అలంకరణలో శ్రీబగళాముఖి అమ్మవారు, పక్కన అమ్మవారికి అందజేసిన హారం

పిట్టలవానిపాలెం, జూన్ 2: మండలంలోని చందోలు గ్రామంలోవేంచేసిన శ్రీబగళాముఖి అమ్మవారికి రేపల్లె నియోజకవర్గం నగరం మండలం పుడివాడ గ్రామానికి చెందిన తోట కూర సాంబశివరావు ఆదివారం లక్షా30వేల రూపాయల విలువ చేసే లక్ష్మీదేవి బంగారపు హారాన్ని సమర్పించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి జి. నరసింహమూర్తి దా త అందజేసిన హారాన్ని అమ్మవారికి అలంకరించారు. ఆయనకు వేద ఆశీర్వచనాలు అందజేసి అమ్మవారి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఆలయసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక స్థాయి నుంచే సివిల్స్ లక్ష్యం కావాలి



శిక్షణకు హాజరైన విద్యార్థులతో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తదితరులు

గుంటూరు(విద్య), జూన్ 2: విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే సివిల్స్ లక్ష్యంగా కృషి చేయాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు సూచించారు బ్రాడీపేటలోని యూటీఎఫ్ హాలులో 11 రోజులపాటు నిర్వహించిన సివిల్స్ ఫౌండేషన్ శిక్షణా తరగతులు ముగింపు సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సివిల్ సర్వీసెస్ సాధించాలంటే జనరల్ స్టడీస్, కరెంట్ ఎఫైర్స్‌పై పూర్తిస్థాయిలో పట్టు సాధించాలని సూచించారు. అంతేకాకుండా మెంటల్ ఎబిలిటీ, జనరల్ సైన్స్ పాలిటీ, జాగ్రఫీ, ఇంగ్లీషు మొదలైన అంశాలపై పట్టు ఉండాలని పేర్కొన్నారు. సివిల్ సర్వీసెస్ అర్హత, సిలబస్, పరీక్షా విధానం గురించి తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు బీ ప్రసాద్, జీవీవీ సుబ్బారాయుడు, సన్ సమన్వయకర్తలు సాయి, ఆషిష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా క్రీడాభివృద్ధి అధికారిగా పీ నరసింహారెడ్డి

గుంటూరు(తూర్పు), జూన్ 2: జిల్లా క్రీడాభివృద్ధి అధికారిగా పీ నరసింహారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు బీఆర్ స్టేడియంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన వెంకటేశ్వరరావు పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో చీఫ్ కోచ్‌గా నరసింహారెడ్డి నియమితులయ్యారు. అనంతరం నరసింహారెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని క్రీడలు, క్రీడా ప్రాంగణాల అభివృద్ధికి తన వంతు సహకారాలు అందజేస్తానని తెలిపారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చీఫ్ కోచ్ నరసింహారెడ్డిని బీఆర్ స్టేడియం సిబ్బంది, కోచ్‌లు, వివిధ క్రీడల అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

ప్రకాశం జట్టుపై గుంటూరు ఘన విజయం

మంగళగిరి సిటీ, జూన్2: సెంట్రల్ జోన్ అండర్-15 మహిళల వన్డే టోర్నీలో భాగంగా మంగళగిరిలోని ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో ఆదివారం రెండు మ్యాచ్‌లు జరిగాయి. తొలుత ఉదయం కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల మధ్య జరిగిన మ్యాచ్‌లో కృష్ణా జిల్లా జట్టు 9 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పశ్చిమ గోదావరి జిల్లా జట్టు 15 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి కేవలం 55 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఓ.సాహితిశ్రీ 20 పరుగులు చేయగా, కృష్ణా బౌలర్లు వి.అక్షయ, ఆర్.మానస యశోద చెరో వికెట్ పడగొట్టారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కృష్ణా జిల్లా జట్టు 9.2 ఓవర్లలో ఒక్క వికెట్ నష్టానికి 58 పరుగులు చేసి లక్ష్యాన్ని ఛేదించింది. టీ.గుణచంద్రిక అత్యధికంగా 31 పరుగులు సాధించింది.

మధ్యాహ్నం గుంటూరు, ప్రకాశం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో గుంటూరు జిల్లా జట్టు 7 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ప్రకాశం జట్టు నిర్ణీత 25 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 157 పరుగులు చేసింది. వి.శేతుసాయి 89 బంతుల్లో 19 ఫోర్లతో 111 పరుగులు సాధించి నాటౌట్‌గా నిలిచింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన గుంటూరు జట్టు 24.1 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 158 పరుగులు చేసి లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించింది. కే.దీక్ష 89 బంతుల్లో 92 పరుగులు చేయగా, ప్రకాశం బౌలర్ కే.పౌశ్య 5 ఓవర్లలో 22 పరుగులిచ్చి రెండు వికెట్లు సాధించింది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.90 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	152, 161,173
చికెన్ విత్ స్కిన్	294.00
చికెన్ స్కిన్ లెస్	304.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



దాచేపల్లి పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న బీఎస్ఎఫ్ దళాలు

గుంపులుగా చేరితే ఉపేక్షించేది లేదు

● సీఐ సురేంద్రబాబు హెచ్చరిక

దాచేపల్లి,జూన్2: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడనున్న తరుణంలో ప్రజలు గుంపులుగా, సభలు, సమావేశాలు నిర్వహించడం, ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం వంటివి చేస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదని సీఐ సురేంద్రబాబు తెలిపారు. ఆదివారం దాచేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీఎస్ఎఫ్, స్థానిక పోలీసు సిబ్బంది కలిసి మొత్తం 90మందికి పైగా ఉన్నారని వివరించారు. ఫుల్ పవర్స్‌తో పనిచేస్తున్న సిబ్బంది ముందస్తు హెచ్చరికలు లేకుండానే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు అవసరమైతే మినహా అనవసరంగా వీధుల్లో తిరడటం మూసివేసిన దుకాణాల వద్ద కూర్చోవడం వంటి పనులు చేయరాదని సూచించారు. ఇప్పటికే మైకుల ద్వారా ఇతర ప్రచార మాధ్యమాల ద్వారా ప్రజలకు వివరించామన్నారు. అత్యంత సమస్యాత్మక గ్రామాలైన తంగెడ, కేశానుపల్లి, రామాపురం, పెదగార్లపాడు, మాదినపాడు, నడికూడి, ఇరికేపల్లి, గామాలపాడు గ్రామాలలో ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. 4వ తేదీ ఉదయం నుండే మరింత కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని, చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తే కేసులు పెడతామని హెచ్చరించారు. ఇప్పటికే జిల్లా ఉన్నతాధికారులు ఇచ్చిన ఆదేశాలతో మండలంలో ప్రశాంత వాతావరణం ఏర్పడిందని, ఇదేపరిస్థితిని కౌటింగ్ ముగిసే వరకు కొనసాగించాలని ఆయన కోరారు.

పార్టీ కార్యాలయాల వద్ద భద్రత ఏర్పాట్లు

పిడుగురాళ్ల, జూన్ 2: సాధారణ ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో పిడుగురాళ్లలో టీడీపీ, వైసీపీ కార్యాలయాల వద్ద పోలీసులు తగిన భద్రతా ఏర్పాట్లు చేశారు. అనుమతి లేకుండా వాహనాలు, బయటి వ్యక్తులు ఎవరూ కార్యాలయాల వద్దకు పోకుండా బారికేడ్లు అడ్డుపెట్టి పోలీసులను కాపలాగా నియమించారు. పిడుగురాళ్లలో ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు, వైసీపీ అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి కార్యాలయాల వద్ద కూడా బారికేడ్లు అడ్డుపెట్టి ఇద్దరు కానిస్టేబుల్స్‌ను కాపలాగా ఉంచారు. ఫలితాలు వెలువడిన అనంతరం ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్తలో భాగంగా ఇరు పార్టీల నేతలు, పార్టీ కార్యాలయాల వద్ద తగిన భద్రత ఏర్పాటుచేసినట్లు పట్టణ సీఐ ఆంజనేయులు తెలిపారు.

విద్వేషాలు రెచ్చగొట్టొద్దు

సత్తెనపల్లి, జూన్ 2 : సత్తెనపల్లి సబ్ డివిజన్‌లోని ప్రజలు ఎవ్వరూ సోషల్ మీడియా, వాట్సప్‌లలో విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా సందేశాలు, ఫోటోలు పోస్టు చేయరాదని, అలా చేస్తే ఆ గ్రూపు అడ్మిన్స్ పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని డీఎస్పీ గురునాథబాబు ఆదివారం ఒక ప్రటనలో హెచ్చరించారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే ఎటువంటి పోస్టులు, సందేశాలు, ఫోటోలు పంపితే గ్రూపు అడ్మిన్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ప్రతి ఒక్కరు నిబంధనలు పాటిస్తూ పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో భాగంగా ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు

బెల్లంకొండ, జూన్ 2 : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో గ్రామాల్లో గొడవలు సృష్టించేవారిపై కఠిన మైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రాజేష్ హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామ ప్రజలతో మెయిన్ సెంటర్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండంలో నాగిరెడ్డిపాలెం గ్రామం సమస్యాత్మకమైన గ్రామమని, ఈ గ్రామంలో గొడవలు చేయాలని చూస్తే వారి పై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. 144 సెక్షన్ అమల్లో ఉందని, ముగ్గురు గాని, నలుగురు గాని గుమ్మికూడితే వారి పై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామంలో ప్రశాంత వాతావరనం కల్పించాలని, కొత్త వ్యక్తులు ఎవరైనా కనపడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. 6వ తేదీ వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, ఎవరు గెలిచినా విజయోత్సవ ర్యాలీలు, గులాంలు, బాణ సంచాలు, డీజీలకు అనుతులులేవని, అలాకాకుండా ఎవరైనా వాటిని అమలు చేయాలని చూస్తే జిల్లా బహిష్కరణ ఉంటుందని తెలిపారు. అందరూ కలసి కట్టుగా ప్రశాంత వాతావరణం నెలకొల్పాలని, గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని కోరారు. సమావేశంలో ఏఎస్ఐ బెన్‌హర్, రమేష్, హెడ్ కానిస్టేబుల్ హుస్సేన్, సిబ్బంది రాజేష్, వెంకటేశ్వర్లు, షణ్ముకు, వెంకటరావు పాల్గొన్నారు.



గంగమ్మ తల్లికి బోనాలు తీసుకువెళ్తున్న తెలుగు మహిళలు

కూటమి గెలుపు కోసం గంగమ్మతల్లికి బోనాలు

● ఊటుకూరు నుంచి ఓర్వకల్లు వరకు తెలుగు మహిళల పాదయాత్ర

క్రోసూరు, జూన్ 2: టీడీపీ అధికారంలోకి రావటంతో పాటు పెదకూరపాడు నియోజకవర్గంలో భాష్యం ప్రవీణ్ విజయం సాధించాలని కోరుకుంటూ రాష్ట్ర తెలుగు మహిళ అధికార ప్రతినిధి వేగుంట రాణి ఆధ్వర్యంలో ఆదివారం ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఓర్వకల్లు గంగమ్మ తల్లికి తెలుగు మహిళలు బోనాలు సమర్పించారు. ఊటుకూరు గ్రామం నుంచి ఓర్వకల్లు దేవస్థానం వరకు బోనాలు నెత్తిన పెట్టుకొని వందలాది మంది తెలుగు మహిళలు పాదయాత్రగా దేవాలయం వద్దకు వెళ్ళారు. ఓర్వకల్లు గంగమ్మ తల్లికి ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేగుంట రాణి మట్లాడుతూ ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో రాష్ట్రం అల్లకల్లోల మైందని, మరో రెండు రోజుల్లో రాష్టానికి పట్టిన పీడ అమ్మవారి దయతో వీడనున్నదని, ఈ సందర్భంగా టీడీపీ అధికారంలోకి రావటంతో పాటు ఎమ్మెల్యేగా భాష్యం ప్రవీణ్ గెలవాలని కోరుతూ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్టు తెలిపారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండటంతో పాటు ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఈ సందర్భంగా కోరిన కోర్కెలు తీర్చే గంగమ్మ తల్లి అమ్మవారిని వేడుకున్నట్టు ఆమె చెప్పారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆలయంలో మరోసారి మొక్కుబడులు చెల్లించుకుంటామని అమ్మవారికి మొక్కున్నట్టుగా ఆమె తెలిపారు. కార్యక్రమంలో వందలాది మంది తెలుగు మహిళలు పాల్గొన్నారు.

ఐతమ్‌రాజుకు ఘన సన్మానం

బెల్లంకొండ, జూన్ 2: మండలంలోని చంద్రాజుపాలెం పశు సంవర్ధక శాఖలో లైఫ్ స్టాక్ అసిస్టెంట్‌గా పనిచేసిన తెల్లమేకల ఐతమ్‌రాజుకు ఆదివారం మండల కేంద్ర మైన బెల్లంకొండ పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో దంపతులకు ఘన సన్మానం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పశు సంవర్ధకశాఖ ఏడీఏ వీరయ్య ముఖ్య అతిథిగా హాజరై ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సన్మాన గ్రహీత తెల్లమేకల ఐతమ్‌రాజు గత 22 సంవత్సరాలుగా పశు సంవర్ధక శాఖలో నోరు లేని మూగ జీవాలకు సేవలు అందించారని అన్నారు. సహచర ఉద్యోగులతో కలసి మెలసి చిరు ఉద్యోగం నుంచి అంచలంచలుగా ఎదిగి లైఫ్ స్టాక్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందారన్నారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ అధికారులు, సహచర ఉద్యోగులు తెల్లమేకల నాగేశ్వరరావు, మల్లికార్జునరావు, గురవయ్య, ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

మల్లాదిలో పోలీసుల కార్డెన్‌సెర్చ్

అమరావతి, జూన్ 2: పల్నాడుజిల్లా ఎస్పీ మాలికాకార్గ్ ఆదేశాల మేరకు సమస్యాత్మక గ్రామాలలో ఎన్నికల ఫలితాల అనంతరము ఎలాంటి ఘర్షణలకు తావులేకుండా ముందస్తు భద్రతా చర్యలలో బాగంగా అమరావతి పోలీసులు కార్డెన్ తనిఖీలు చేస్తున్నారు. సీఐలు బ్రహ్మం, సుబ్బారావులు తమ సిబ్బందితో ఆదివారం సాయంత్రం మండల పరిధిలోని మల్లాది గ్రామంలో తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పద ప్రదేశాలను క్షుణ్ణంగా గాలించారు. ఈ సంర్భంగా వారు మాట్లాడుతూ జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడుతునన నేపథ్యంలో గ్రామంలో ఎవరూ ఘర్షణలకు, దాడులకు దిగకుండా ఉండాలని సూచించారు.

పోలీసు పహారాలో మాచర్ల



బస్టాండ్ సెంటర్లో నిలిపివుంచిన వజ్రవాహనం

- ఎన్నికల ఆంక్షలతో మూతపడ్డ దుకాణాలు
- నిర్మానుష్యంగా రహదారులు
- ఆక్టోపస్ బృందాలతో ఫ్లాగ్‌మార్చ్
- బస్టాండ్ సెంటర్లో వజ్ర వాహనం ఏర్పాటు
- దొడ్డిదారిన మద్యం విక్రయాలు

మాచర్లటౌన్, జూన్ 2: ఎన్నికల కౌంటింగ్, ఎగ్జిట్ పోల్స్ ఒపినీయన్స్ నేపథ్యంలో మాచర్ల పట్టణంలో పోలీసులు భారీ బందోబస్తు చేపట్టారు. శనివారం సాయంత్రం నుంచే పట్టణంలో పోలీసు ఆంక్షలు మొదలయ్యాయి. దుకాణాలు మొత్తం మూసివేయించంతో జనజీవనం స్తంభించింది. దీంతో మాచర్ల పట్టణం బోసిపోయినట్టయిది. 144 సెక్షన్, పోలీసు 30 యాక్ట్ అమలులో ఉందని, పోలీసులు ప్రత్యేకంగా మైకులో అనౌన్స్‌మెంట్ చేసుకుంటూ దుకాణాలను మూసివేయించారు. ఈనెల 5వ తేదీవరకు ఈ ఆంక్షలు కొనసాగుతాయని, నలుగురికి మించి గుమికూడడానికి వీల్లేదని, పట్టణంలో పోలీసు కవాతు నిర్వహించారు. అక్టోబస్ బృందాలతో ఏఎస్పీ కే.నాగేశ్వరరావు నేతృత్వంలో పట్టణ ప్రధాన రహదారుల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.



రామాటాకీస్ వద్ద మూత పడ్డ దుకాణాలు

వజ్ర వాహనం ఏర్పాటు ..

పట్టణంలో అవాంఛనీయ సంఘటనలు జరిగితే నివారించేందుకు పోలీసులు ముందస్తుగా వజ్ర వాహనాన్ని బస్టాండ్ సెంటర్లో సిద్ధంగా ఉంచారు. పరిస్థితులు అదుపు తప్పితే ఈ వాహనం ద్వారా స్మోక్ గన్స్, రబ్బర్ బుల్లెట్లు, వీడియోగ్రఫీ చేసేందుకు ఏర్పాట్లు సిద్ధం చేసుకున్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా వివిధ రాజకీయ పార్టీల నేతలను హెచ్చరించి గృహ నిర్బంధంలో ఉంచారు. పట్టణ శివారు రాయవరం జంక్షన్, కొత్తపల్లి జంక్షన్, శ్రీశైలం రోడ్డు, రింగు రోడ్డు, బస్టాండ్ సెంటర్, నెహ్రూనగర్‌లలో పోలీసు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. సరైన ఆధారాలు చూపించకుంటే వాహనాలను వెనక్కు పంపుతున్నారు.

తెరుచుకున్న మద్యం దుకాణాలు

మాచర్ల పట్టణంలో ప్రభుత్వ మద్యం దుకాణాలు యధావిధిగా కొనసాగాయి. రింగురోడ్డు సెంటర్, రైల్వే స్టేషన్ రోడ్డు, రాయవరం జంక్షన్ సమీపంలోని ప్రభుత్వ మద్యం దుకాణాలు తెరుచుకున్నాయి. రింగురోడ్డులోని పబ్బతి బార్ అండ్ రెస్టారెంట్, ఆర్అండ్‌బి బంగ్లా వద్ద ఉన్న గ్రీన్‌పార్క్ బార్ అండ్ రెస్టారెంట్‌లలో ఉదయం 5 గంటల నుంచే విక్రయాలు నిర్వహిస్తుండటంతో 11 గంటలకు పోలీసులు బలవంతంగా మూసివేయించారు. దీంతో మెయిన్ ద్వారాలు మూసివేసి దొడ్డిదారిన విక్రయాలు కొనసాగించారు. నిత్యావసర వస్తువులు కావాలంటే పోలీసులు సవాలక్ష ఆంక్షలు విధిస్తున్నారని, వైన్స్, బార్ అండ్ రెస్టారెట్లలలో మద్యం విక్రయాలు దొడ్డిదారిన కొనసాగిస్తున్నా పోలీసులు చూసిచూడనట్లు వ్యవహరించడంపై ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఘర్షణలకు ప్రధాన ప్రేరేపకమైన మద్యాన్ని బార్ అండ్ రెస్టారెంట్లు తెరిచి విక్రయాలు సాగిస్తుంటే పోలీసులు మిన్నకుండిపోవడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఇలాగే కొనసాగితే పరిస్థితి అదుపు తప్పే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసున్నారు.

కారంపూడిలో పటిష్ట బందోబస్తు

కారంపూడి: మండల కేంద్రమైన కారంపూడిలో 144 సెక్షన్ కొనసాగుతోంది. ఈనెల 4వ తేదీన కౌంటింగ్ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ఠ చర్యలు తీసుకున్నారు. దుకాణాలను మూసివేయించారు. ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారాయి. కారంపూడి-మాచర్ల ప్రధాన రహదారిలోని టీడీపీ కార్యాలయం వద్ద భారీగా పోలీసు బలగాలు మోహరించాయి. సీఐ అలహరి శ్రీనివాస్, ఎస్ఐ అమీర్‌లు ఎప్పటికప్పుడు బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు.



పట్టణంలో మూసి వేసిన షాపులు

సత్తెనపల్లిలో కర్ఫ్యూ వాతావరణం

సత్తెనపల్లి, జూన్ 2 : ఓట్ల లెక్కింపు నేపథ్యంలో- సత్తెనపల్లిలో ఆదివారం నుంచి 144 సెక్షన్, 30 పోలీసు యాక్ట్ అమలుచేయటంతో పట్టణంలోని వివిధ వ్యాపార సంస్థలను పోలీసుల ఆదేశాల మేరకు మూసి వేశారు. దీంతో వివిధ ప్రాంతాల్లో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కౌంటింగ్ సందర్భంగా పోలీసులు కఠినంగా వ్యవహ రించాలని ఎస్పీ ఆదేశాలు జారీ చేయటంతో పోలీసులు సత్తెనపల్లి పట్టణంతో పాటు సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. దీంతో సత్తెనపల్లి పట్టణంలో జన సంచారం తగ్గి కర్ఫ్యూ వాతావరణం అలుముకుంది.

కూటమి శ్రేణుల్లో జోష్..

సత్తెనపల్లి, జూన్ 2 : రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వస్తుందని పలు సంస్థలు శనివారం సాయంత్రం ఎగ్జిట్ పోల్స్ ద్వారా ప్రకటించాయి. దీంతో సత్తెనపల్లి నియోజకవర్గంలోని కూటమి శ్రేణుల్లో జోష్ నెలకుంది. సత్తెనపల్లి నియోజకవర్గంలో టీడీపీకి పూర్వ వైభవం వస్తుందని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు. ఎగ్జిట్‌పోల్స్ కూటమికి అనుకూలంగా ఉండటంతో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు, కూటమి అభిమానులు ఆనందంలో మునిగి పోయారు. కూటమి తప్పక ప్రభుత్వం ఏర్పాటుచేస్తుందని, అందుకు ఎగ్జిట్ పోల్స్ గణాంకాలే నిదర్శనమని చెపుతున్నారు. ఈనెల 4న ఓట్ల లెక్కింపు అనంతరం సీఎం జగన్‌రెడ్డి గద్దె దిగటం, నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయటం ఖాయమంటున్నారు. పోస్టల్ బ్యాలెట్లలోను అధిక మెజార్టీ వస్తుందని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ కోతలే కోతలు

సత్తెనపల్లి, జూన్ 2 : సత్తెనపల్లి పట్టణంలో విద్యుత్ కోతలు తీవ్రమయ్యాయని, రాత్రి పగలు అనే తేడా లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్న గాలి వీచినా, వర్షం కురిసినా విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నారు. ఎండ, ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే వేళాపాళలేని కోతలు మరింత ఇబ్బందికి గురిచేస్తున్నాయని అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొంత లోవోల్టేజీ సమస్య కూడా తలెత్తుతుంది. విద్యుత్ కోతల వేళల సమయాలు ప్రకటించాలని ప్రజలు కోరుతున్నారు.



దహనమైన లారీని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

లారీ దహనంపై కేసు

రెంటచింతల,జూన్ 2: మండలంలోని మిట్టగుడిపాడు గ్రామంలో ఆదివారం వేకువ జామున ఓ లారీ దహనమైన సంఘటన జరిగింది. ఎస్ఐ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణపట్నం పోర్టు నుంచి బొగ్గు లోడ్‌తో వచ్చిన లారీ దాచేపల్లి సమీపంలోని చెట్టినాడ్ సిమెంట్ ఫ్యాక్టరీలో బొగ్గును అన్‌లోడ్ చేసింది. అక్కడనుంచి మిట్టగుడిపాడు గ్రామానికి నాపరాయి లోడింగ్ కు వచ్చింది. డ్రైవర్ నాగరాజు ఇదే గ్రామానికి చెందిన వాడు కావడంతో లారీని అక్కడే నిలిపి ఉంచి ఇంటికి వెళ్లాడు. అనంతరం కొద్ది సమయానికి లారీ నుంచి మంటలు వచ్చాయి. దీంతో స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించగా వెంటనే వచ్చి మంటలను ఆర్పినట్లు ఫైర్ ఆఫీసర్ సునీల్ తెలిపారన్నారు. ఘటనా స్థలాన్ని గురజాల డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు సందర్శించారు. గుర్తు తెలియని వ్యక్తులు కావాలనే లారీకి నిప్పు పెట్టారని డ్రైవర్ నాగరాజు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. లారీలో 5 కేజీల గ్యాస్ సిలిండర్ ఉంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.



నిర్మానుష్యంగా వున్న అచ్చంపేటలోని ఆంజనేయుని విగ్రహం సెంటరు

పోలీసు నీడన గ్రామాలు

నకరికల్లు, జూన్ 2: ఈనెల 4వతేదీ ఎన్నిల కౌంటింగ్ ప్రక్రియ ఉన్నందున మండలంలోని అన్ని గ్రామాల్లో పోలీసులు 144వ సెక్షన్ విధించారు. నకరికల్లు ఎస్ఐ పీ రాంబాబు తన సిబ్బందితో మొబైల్ టీమ్ ద్వారా అన్ని గ్రామాలను పర్యవేక్షిస్తున్నారు. మండలంలోని గ్రామాలన్నీ కర్ఫ్యూ వాతవరణాన్ని తలపింప చేస్తున్నాయి. నకరికల్లులోని కొట్ల బజారు, సర్వీస్ రోడ్డు, ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. కుంకలగుంట, చేజర్ల, రూపెనగుంట్ల, చీమలమర్రి, గుండ్లపల్లి గ్రామాల్లో పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈనెల 5 వరకు గ్రామాల్లో పోలీసు పికెట్ కొనసాగుతుందని ఎస్ఐ పీ రాంబాబు తెలిపారు.

దుర్గి: ఈనెల 4వ తేదీన ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా మండలంలో 144 సెక్షన్ పోలీసులు నిర్వహించారు. దుకాణాలు మూసివేయడంతో ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు ఎస్ఐ కోటయ్య తెలిపారు.

రెంటచింతల : మండలంలోని 9 గ్రామాల్లో పోలీస్ పికెట్ కొనసాగుతుందని ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. 11 గ్రామాలకు గాను మల్లవరం, మిట్టగుడిపాడు గ్రామాల్లో మాత్రమే లేదన్నారు. ఒక్కో పికెట్‌లో ఐదుగురు కానిస్టేబుళ్లు ఉంటారన్నారు.

అచ్చంపేట: మండల కేంద్ర మైన అచ్చంపేటలో ఆదివారం ఉదయం 9 గంటలకే రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. 144 సెక్షన్ అమల్లో ఉండటంతో పోలీసుల హెచ్చరికలతో దుకాణాలన్నీ బంద్ అయ్యాయి. దీంతో అచ్చంపేటలో కర్ఫ్యూను తలపిస్తుంది. చిన్నచిన్న దుకాణాలు, కూరగాయలు షాపులు బంద్ అయ్యాయి. 4వ తేదీ కౌంటింగ్ జరగనున్న నేపథ్యంలో పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ఇదే విధంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

విజయపురిసౌత్: మాచర్ల మండలం విజయపురిసౌత్‌లో పోలీసు పహారా కొనసాగుతోంది. అంబేద్కర్ సెంటర్, లాంచీ స్టేషన్ తదితర ప్రధాన కూడళ్లలో పోలీసు బలగాలు మోహరించారు. ఈనెల 4వ తేదీన కౌంటింగ్ నేపథ్యంలో 144 సెక్షన్ విధించారు. ప్రతి ఆదివారం భక్తుల రాకతో కిటకిటలాడే సాగరమాత ఆలయ ప్రధాన గేటుకు కూడా తాళాలు వేయించారు.

మద్యం స్వాధీనం

దాచేపల్లి, జూన్ 2: దాచేపల్లి నగర పంచాయతీలోని ఎంఎస్ పేటలో రూ. 50 వేల విలువ కలిగిన మద్యాన్ని పెదగార్లపాడులో, శ్రీచక్ర సిమెంట్ ఫాక్టరీ వద్ద మరో రూ.5 వేల విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు దాచేపల్లి సీఐ సురేంద్రబాబు ఆదివారం తెలిపారు. తనిఖీలు నిర్వహించిన సందర్భంలో దాచిన మద్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు.

అటవీ ప్రాంతంలో పోలీసుల తనిఖీ

● 30 లీటర్ల నాటుసారా స్వాధీనం

నకరికల్లు, జూన్2: చేజర్ల తండా సమీపానగల అటవీప్రాంతంలో ఆదివారం ఎస్ఐ పీ.రాంబాబు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది విస్తృత తనిఖీ నిర్వహించి 30 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. నాటుసారా బట్టీ ప్రాంతాలను, వాములు, దిబ్బలను విస్తృతంగా జల్లెడపట్టారు. సారా తయారుచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పీ.రాంబాబు హెచ్చరికలు జారీ చేశారు. చేజర్ల గ్రామానికి చెందిన బాణావత్ కృష్ణానాయక్, బాణావత్ శివనాయక్, బాణావత్ శంకర్‌నాయక్‌లు కలసి నాటుసారాను తీసుకొని వస్తుండగా వారిని పట్టుకొనే ప్రయత్నంలో బాణావత్ రామకృష్ణనాయక్ పోలీసులకు చిక్కాడు. మిగతా ముగ్గురు పరారయ్యారు. రామకృష్ణనాయక్ వద్ద ఉన్న 30 లీటర్ల నాగు సారాను స్వాధీనం చేసుకున్నారు. అతడిని పోలీసు స్టేషన్‌కు తీసుకు వచ్చి ఎస్ఐ పీ.రాంబాబు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



సారా బట్టీల వద్ద తనిఖీ చేస్తున్న పోలీసులు, స్వాధీనం చేసుకున్న సారా



నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ ఎన్నికల కో-ఆర్డినేటర్ జంగా కృష్ణమూర్తి శనివారం రాత్రి హైదరాబాద్‌లో టీడీపీ అధినేత చంద్రబాబును ఆయన నివాసంలో కలిశారు. పల్నాడు ప్రాంతంలో ఎన్నికల సరళిని, ఫలితాల గురించి చంద్రబాబుకు వివరించారు.
- పిడుగురాళ్ల

అందరూ సంయమనం పాటించాలి

● మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

పిడుగురాళ్ల, జూన్ 2: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలందరూ సంయమనం పాటించి ప్రజాతీర్పుకు స్వాగతం పలకాలని నరసరావుపేట పార్లమెంట్ టీడీపీ ఎన్నికల కో-ఆర్డినేటర్ జంగా కృష్ణమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పల్నాడు ప్రాంతం అనాదిగా కక్షలు, కార్పణ్యాలతో అభివృద్ధికి నోచుకోలేదని, అక్షరాస్యత, అభివృద్ధితో ప్రజలు చైతన్యం దిశగా నడిచిన రోజు పగలు, ప్రతీకారాలకు స్వస్తి పలకడం జరుగుతుందన్నారు. క్షణికావేశంలో గొడవలకు, కొట్లాటకు, ఎన్నికల ఘర్షణలకు పాల్పడితే కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నం అవడంతో పాటు ఆర్థిక, అనారోగ్య సమస్యలు చుట్టుముడతాయన్నారు. యువత భవిష్యత్ అంధకారమవుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రతి ఒక్కరు ఎన్నికల వరకే రాజకీయాలు చేయాలని, అనంతరం అన్నిపార్టీల నేతలు, వ్యక్తులు ఆయా ప్రాంతాల అభివృద్ధికి కృషిచేయాలే తప్ప కక్ష సాధింపులకు కాదని హితవు పలికారు.



పిడుగురాళ్ల సమీపంలో వాహనాలను తనిఖీ చేస్తున్న ఏఎస్ఐ కొండలరావు


పల్నాడులో కొనసాగుతున్న 144 సెక్షన్

● ముమ్మరంగా వాహనాల తనిఖీ

పిడుగురాళ్ల, జూన్ 2: ఎన్నికల ఫలితాల నేపథ్యంలో పల్నాడు ప్రాంతంలో ఆదివారం 144 సెక్షన్ కొనసాగింది. గురజాల నియోజకవర్గ పరిధిలోని దాచేపల్లి, పిడుగురాళ్ల, గురజాల, మాచవరం మండలాల పరిధిలో అత్యవసర సర్వీసులు మినహా మిగిలిన దుకాణాలన్నీ మూసివేసి ఉన్నాయి. దాచేపల్లి, గురజాల, పిడుగురాళ్ల పట్టణాలలో పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. పట్టణ శివారు ప్రాంతంలో ప్రత్యేక బలగాలతో కూడిన పోలీసు బృందం పట్టణంలోకి వచ్చి వెళ్లే కార్లు, ద్విచక్ర వాహనాలను నిశితంగా పరిశీలించారు. అనుమానాస్పద వస్తువులు, వ్యక్తులు ఎవరైనా ఉన్నారేమోనని పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. కొండమోడు వద్ద ఏఎస్ఐ కొండలరావు వాహనాలను తనిఖీ చేశారు. పత్రాలు లేని వాహనాలను పోలీసులు గుర్తించి స్టేషన్‌కు తరలించడం జరుగుతుందని ఎస్ఐ రబ్బాని ఖాన్ తెలిపారు.

బెల్లంకొండ మండలం నుంచి కౌంటింగ్..

క్రోసూరు, జూన్ 2 : పెదకూరపాడు నియోజకవర్గ కౌంటింగ్ బెల్లంకొండ మండలం నుంచిప్రారంభమవుతుందని అధికారులు తెలియజేశారు. కౌంటింగ్ కోసం 14 తేబుళ్ళ పై 19 రౌండ్లలో కౌంటింగ్ పూర్తవుతుందన్నారు. నియోజకవర్గంలో మొత్తం 2,32,453 ఓట్లు ఉండగా 2,07,307 ఓట్లు పోలయ్యాయి. మొత్తం 89.18శాతం పోలింగ్ నమోదైంది. 1,01,833 పురుష ఓటర్లు, 1,05,469 మహిళా ఓటర్లు, ఐదు ఇతర ఓటర్లు పోలయ్యాయి. మొదటి రౌండ్ ఓట్ల లెక్కింపులో బెల్లంకొండ మండలంలోని నందిరాజుపాలెం, నాగిరెడ్డిపాలెం, బెల్లంకొండ, గంగిరెడ్డిపాలెం, కొత్తపాలెం, వన్నాయపాలెం, మాచాయపాలెం గ్రామాలు ఉన్నాయి. రెండవ రౌండ్‌లో ఆర్ఆర్ సెంటర్, చంద్రాజుపాలెం, కందిపాడు, పాపాయపాలెం, మన్నె సుల్తాన్‌పాలెం, యమ్మాజీగూడెం, 3వ రౌండ్‌లో బెల్లంకొండ మండలంలోని వెంకటాయపాలెంతో పాటు అచ్చంపేట మండలం మాదిపాడు, కంచుబోడుతండా, గింజుపల్లి, చల్లగరిగ, తాడువాయి, చింతపల్లి, పుట్లగూడెం, చెరుకుంపాలెం, కొత్తపల్లి, 4వ రౌండ్‌లో కొత్తపల్లి, తాళ్ళచెరువు, చామర్రు, 5వ రౌండ్‌లో చామర్రు, నీలేశ్వరపాలెం, చిగురుపాడు, రోకలిగుంటపాలెం, ఆర్ఆర్ సెంటర్, కోగంటివారిపాలెం, అంబడిపూడి, కోనూరు, 6వ రౌండ్‌లో కోనూరు, కస్తల, ఓర్వకల్లు, రుద్రవరం, గ్రంధసిరి, వేల్పూరు, పెదపాలెం, 7వరౌండ్‌లో పెదపాలెం, ఆర్ఆర్ సెంటర్, మిట్టపాలెం, కొండూరు, నిండుజర్ల గ్రామాలతో పాటు క్రోసూరు మండలంలోని దొడ్లేరు గ్రామంలో కొన్ని బూత్‌లు ఉన్నాయి. 8వ రౌండ్‌లో ఆవులవారిపాలెం, పెరికపాడు, హసానాబాద్, నాగవరం, గుడిపాడు, గరికపాడు, ఉయ్యందన, 9వ రౌండ్‌లో ఉయ్యందన, 88 తాళ్ళూరు, పీసపాడు, పారుపల్లి, ఎర్రబాలెం గ్రామాలతో పాటు క్రోసూరులోని కొన్ని బూత్‌లు ఉన్నాయి. 10వ రౌండ్‌లో క్రోసూరు, అనంతవరం, అందుకూరు, బాలెమర్రు, విప్పర్ల, 11వ రౌండ్‌లో ఊటుకూరు, బయ్యవరం గ్రామాలతో పాటు పెదకూరపాడు మండలంలోని గారపాడు, లగడపాడు, కన్నెగండ్ల, 12వ రౌండ్‌లో హుస్సేన్‌నగరం, రామాపురం, బుచ్చయ్యపాలెం, పెదకూరపాడు, 13వ రౌండ్‌లో అబ్బరాజుపాలెం, చిన మక్కెన, లింగంగుంట్ల, పొడపాడు, ముస్సాపురం, పాటిబండ్ల, జలాలపురం, 14వ రౌండ్‌లో జలాలపురం, కంభంపాడు, బలుసుపాడు, కాశిపాడు, తమ్మవరం, 75 తాళ్ళూరు 15వ రౌండ్‌లో 75 తాళ్ళూరుతో పాటు అమరావతి మండలంలోని మునగోడు, జూపూడి, అత్తలూరు, పొందుగుల, మల్లాది, 16వ రౌండ్‌లో మల్లాది, దిడుగు, ధరణికోట, అమరావతి, 17వ రౌండ్‌లో అమరావతి, పెదమద్దూరు, 18వ రౌండ్‌లో పెదమద్దూరు, వైకుంఠపురం, లింగాపురం, నరుకుళ్ళపాడు, ఎండ్రాయి, చావపాడు, 19వ రౌండ్‌లో లేమల్లెకర్లపూడి, ఉంచుటూరు, నెమలికల్లు, మండెపూడి గ్రామాలు ఉన్నాయి.



ఆంక్షలతో నిర్మానుష్యమైన క్రోసూరు వీధులు

క్రోసూరులో 144 సెక్షన్

● కఠినంగా ఆంక్షలు అమలు.. ఉల్లంఘిస్తే చర్యలు

క్రోసూరు, జూన్ 2 : పల్నాడు జిల్లా పోలీసుల ఆదేశాల మేరకు క్రోసూరు మండల వ్యాప్తంగా 144 సెక్షన్ కింద నిషేదాజ్ఞలు, ఆంక్షలను పోలీసులు ఆదివారం కఠినంగా అమలు చేశారు. దీంతో మండల కేంద్రం క్రోసూరులో వీధులన్నీ నిర్మానుష్యమయ్యాయి. వ్యాపార సంస్థలన్నింటినీ పోలీసులు మూసివేయించారు. వీధుల్లో జన సంచారం లేకుండా కట్టుదిట్టంగా ఆంక్షలను అమలు చేశారు పోలీసులు జట్లు జట్లుగా వీధుల్లో తిరుగుతూ మైకుల ద్వారా హెచ్చరికలు జారీ చేశారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం ఆంక్షలను అమలు చేస్తున్నామని, ప్రజలు సహకరించాలని, సాధ్యమైనంత వరకు గృహాల్లో నుంచి బయటకు రావద్దని వారు ప్రచారం చేశారు. నాలుగు రోడ్ల సెంటర్, అమరావతి బస్టాండ్ సెంటర్లలో ప్రత్యేకంగా చెక్ పోస్టులు, పోలీసు పికెట్‌లు ఏర్పాటు చేశారు. నిషేధాజ్ఞలను కఠినంగా అమలు చేయటంతో ఇతర గ్రామాల నుంచి మండల కేంద్రానికి వచ్చే చిరు వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ముఖ్యంగా కూరగాయల వ్యాపారస్తులు, పండ్ల వ్యాపారస్తులు గ్రామాల్లో సంచరిస్తూ చిన్న చిన్న వ్యాపారాలు చేసుకొనే వారు ఉపాధి కోల్పోతున్నట్టు వాపోయారు. గతంలో అనేక సార్లు ఎన్నికలు జరిగినా ఇటువంటి పరిస్థితి ఎప్పుడూ లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 5వ తేదీ సాయంత్రం వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయని పోలీసులు తెలియ జేశారు. పెదకూరపాడు సీఐ మంగారావు, క్రోసూరు ఎస్ఐ మహమ్మద్ షఫీ బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో సుబ్బారావు

ఎన్నికల కౌంటింగ్‌పై ఆర్వో సమీక్ష

వినుకొండ, జూన్ 2: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఈ నెల 4న జరగనున్న ఓట్లు లెక్కింపుపై పోలీసు, రెవెన్యూ, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆర్వో సుబ్బారావు ఆదివారం సమావేశాన్ని నిర్వహించారు. ఆర్వో మాట్లాడుతూ గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని, కౌంటింగ్ ముగిశాక ఎటువంటి సంబరాలు, ఊరేగింపులు చేసుకోరాదని, శాంతిభద్రతలకు భంగం కలిగించేవారిని గుర్తించి బైండోవర్ చేయడం, 144సెక్షన్ కఠినంగా అమలు చేయడం, బాణసంచా అమ్మకాలు జరగకుండా చూడాలని ఆర్వో అధికారులను ఆదేశించారు. అడిషనల్ ఎస్పీ రాజశేఖర్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఏ పార్టీవారు గెలిచినా గ్రామాల్లో ఎటువంటి ఉద్రిక్తతలు జరగకుండా అన్ని పార్టీల వారు కార్యకర్తలకు సూచనలిచ్చి ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పవలసిన బాధ్యత నాయకులపై ఉందన్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు

నరసరావుపేట లీగల్, జూన్ 2: చోరీ కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్టు మొదటి పట్టణ పోలీసులు ఆదివారం తెలిపారు. గత నెల 20న మండలంలోని పమిడిపాడు గ్రామానికి చెందిన వల్లెపు శివ అనే వ్యక్తి బేలుదారి పనుల నిమిత్తమై బెంగుళూరు వెళ్ళి తిరిగి వస్తూ 20వ తేదీన రైల్వేస్టేషన్ నుంచి ఆర్‌యూబీ సెంటర్ వద్దకు తెల్లవారు జామున 3గంటల సమయంలో వచ్చాడు. ఆ సమయంలో పట్టణంలోని కొండలరావుపేటకు చెందిన సంతోష్ కుమార్, వరవకట్టకు చెందిన ఓ బాల నిందితుడు, మరో ముగ్గురితో కలసి శివను అటకాయించి కత్తులతో బెదిరించి అతని వద్ద నుంచి రూ.2,700 నగదు, సెల్‌ఫోన్‌ను తస్కరించారు. ఈ మేరకు ఆయన మొదటి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు నమోదు చేసుకున్న పోలీసులు సంతోష్ కుమార్‌ను, మరో బాల నిందితుడిని ఆదివారం అరెస్టు చేశారు. ఈ కేసులో మరో ముగ్గురు నిందితులను అరెస్టు చేయాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

ఏపీ మోడల్ స్కూల్‌కు దరఖాస్తు చేసుకోండి

రొంపిచర్ల, జూన్ 2: మండలంలోని రెడ్డిపాలెంలోని ఏపీ మోడల్ పాఠశాలలో 7, 8, 9 తరగతుల్లో మిగిలి ఉన్న అతి కొద్ది సీట్ల భర్తీకై ఆఫ్‌లైన్ పరీక్ష నిర్వహించనున్నట్టు హెచ్‌ఎం నాయక్ ఆదివారం తెలిపారు. దీనికి సంబంధించి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 3వ తేదీ నుంచి 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పరీక్ష పాఠశాల ఆవరణలో 7వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు నిర్వహించ బడుతుందన్నారు. పూర్తిచేసిన తరగతులపై ప్రశ్నలు ఉంటాయన్నారు. వచ్చిన మార్కులు, రిజర్వేషన్ రూల్స్ అనుసరించి ప్రవేశం కల్పించనున్నట్లు తెలిపారు.

టీడీపీ, జీవీ అధికారంలోకి రావాలని పూజలు

వినుకొండ, జూన్ 2: పట్టణంలోని ఏనుగుపాలెం రోడ్డులోని అంకాలమ్మ దేవాలయంలో టీడీపీ నాయకులు, మార్కెట్ యార్డు డైరెక్టర్ తన్నీరు ఆంజనేయులు, కుటుంబసభ్యులు జీవీ ఆంజనేయులు భారీ మెజారిటీతో విజయం సాధించాలని, రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావాలని కోరుతూ ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. మోకాళ్ళపై నిలబడి మొక్కుబడులు చెల్లించుకొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

వినుకొండ టౌన్, జూన్ 2: మండలంలోని జాలలపాలెంలో బార్ అసోషియేషన్ అధ్యక్షుడు కేఎస్‌ఎంవీ నాయుడు అధ్యక్షతన న్యాయ విజ్ఞాన సదస్సును ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి ఎం.మహతి పాల్గొని ఘన పదార్థాలు, వ్యర్థాల నిర్వహణ, పొడి, తడి వ్యర్థాల గురించి పోస్టర్‌లతో ప్రజలకు అవగాహన కల్పించారు. తడి, పొడి వ్యర్థాలు ఎలా వేరుచేయాలి, వేరుచేశాక వాటిని ఎలా వినియోగించుకోవాలో తెలిపారు. తద్వారా పరిసరాల పరిశుభ్రతతో పాటు కాలుష్యం తగ్గి పర్యావరణానికి అనుకూలంగా ఉంటుందన్నారు. న్యాయవాదులు, లోక్ అదాలత్‌ల ద్వారా ప్రజలు న్యాయసాయం ఎలా పొందాలో వివరిస్తూ దానికి కావలసిన అర్హతల గురించి తెలిపారు. ఎవరికైనా న్యాయసాయం అవసరమైతే కోర్టులో లోక్‌అదాలత్‌ను సంప్రదించి న్యాయసహాయాన్ని పొందాలన్నారు. బార్‌అసోషియేషన్ సెక్రటరీ పఠాన్ గౌస్‌మొహిద్దీన్‌ఖాన్, వైస్ ప్రెసిడెంట్ గాలి నాగరాజు, అమరబాబు, రామ్మోహన్‌రావు, నలబోలు సోమశేఖర్, చంటి, రమేష్, పుష్పకుమార్, పోలీసు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



దహనమైన లారీని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

లారీ దహనంపై కేసు

రెంటచింతల,జూన్ 2: మండలంలోని మిట్టగుడిపాడు గ్రామంలో ఆదివారం వేకువ జామున ఓ లారీ దహనమైన సంఘటన జరిగింది. ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణపట్నం పోర్టు నుంచి బొగ్గు లోడ్‌తో వచ్చిన లారీ దాచేపల్లి సమీపంలోని చెట్టినాడ్ సిమెంట్ ఫ్యాక్టరీలో బొగ్గును అన్‌లోడ్ చేసింది. అక్కడనుంచి మిట్టగుడిపాడు గ్రామానికి నాపరాయి లోడింగ్ కు వచ్చింది. డ్రైవర్ నాగరాజు ఇదే గ్రామానికి చెందిన వాడు కావడంతో లారీని అక్కడే నిలిపి ఉంచి ఇంటికి వెళ్లాడు. అనంతరం కొద్ది సమయానికి లారీ నుంచి మంటలు వచ్చాయి. దీంతో స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించగా వెంటనే వచ్చి మంటలను ఆర్పినట్లు ఫైర్ ఆఫీసర్ సునీల్ తెలిపారన్నారు. ఘటనా స్థలాన్ని గురజాల డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు సందర్శించారు. గుర్తు తెలియని వ్యక్తులు కావాలనే లారీకి నిప్పు పెట్టారని డ్రైవర్ నాగరాజు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. లారీలో 5 కేజీల గ్యాస్ సిలిండర్ ఉంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

మద్యం మత్తులో యువకుడి ఆత్మహత్యాయత్నం

బాపట్ల రూరల్, జూన్ 2: మద్యం మత్తులో ఉన్న ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం బాపట్ల మండలం రామ్‌నగర్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే రామ్‌నగర్ గ్రామానికి చెందిన కొక్కిలిగడ్డ స్వామి అనే యువకుడు మద్యం సేవించి సూర్యలంక తీరానికి వెళ్ళాడు. అయితే అక్కడే ఉన్న బంధువులకు, యువకుడికి మధ్య గొడవ ఏర్పడింది. దీంతో మనస్థాపానికి గురై ఆ యువకుడు కత్తితో చేయి, గొంతును కోసుకున్నాడు. దీంతో స్థానికులు వెంటనే బాపట్ల ఏరియా వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు.

మానసిక దివ్యాంగుడిపై దాడి



ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న మానసిక దివ్యాంగుడు

బాపట్ల, జూన్ 2 : పట్టణంలోని పోస్టాఫీస్ దగ్గర టీస్టాల్ సమీపంలో మానసిక దివ్యాంగుడిపై దాడి చేసి కొట్టి గాయపరిచాడు. ఆదివారం తెల్లవారుజామున టీ తాగేందుకు రైలుపేటకు చెందిన మానసిక దివ్యాంగుడు ఆ ప్రాంతానికి వచ్చాడు. దారిన పోయే వాహనదారుడిపై రాయి విసిరేశాడన్న నెపంతో ఓ వ్యక్తి దాడిచేసి గాయపరిచాడు. చట్టుపక్కలవారు చెప్పినా వినకుండా గాయపర్చినట్లు తెలిసింది. క్షతగాత్రుడిని ఏరియా వైద్యశాలకు తరలించారు. దీనిపై పలువురు తీవ్ర విమర్శలు చేస్తున్నారు.

ఫొటో ఎడిటింగ్‌పై వర్క్‌షాపు

బాపట్ల, జూన్ 2: మండలంలోని ముత్తాయపాలెంలో ఆదివారం ఫొటో ఎడిటింగ్‌పై వర్క్‌షాపు నిర్వహించారు. ఫొటోగ్రాఫర్ డాక్టర్ వీవీ ఎస్ నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి చత్తీస్‌ఘడ్ నుంచి ఫ్యాకల్టీగా వచ్చిన కౌషిల్‌సోనీ హైదరాబాద్ నుంచి వచ్చిన రవేంద్రలు స్థానిక ఫొటోగ్రాఫర్‌లకు అవగాహన కల్పించారు. ఫొటోగ్రఫికి సంబంధించి నూతనంగా వచ్చే సాఫ్ట్‌వేర్‌లు ఎలా ఉపయోగించుకోవాలి, ఫొటోఆల్బమ్ డిజైన్ ఎలా చేసుకోవాలో వివరించారు.

వైసీపీ పాలనలో

నీటిపారుదల శాఖపై చిన్నచూపు



అద్దంకి బ్రాంచ్ కెనాల్‌కు ఇరువైపులా అల్లుకుపోయిన చెట్లు

శావల్యాపురం, జూన్ 2: ఐదేళ్ల వైసీపీపాలనలో రైతులకు సాగునీటిని అందించే నీటిపారుదల శాఖపై ప్రభుత్వం చిన్నచూపు చూడడంతో అభివృద్ధి పూర్తిస్థాయిలో కుంటుపడింది. ఐదేళ్ళపాటు కెనాల్‌లు, మేజరు కాలువలు బాగు చేయకపోవడంతో నీటిప్రవాహానికి అడ్డుగా కాలువ కట్టలపై పిచ్చిచెట్లు అల్లుకుపోవడంతో చివరి పొలాల వరకు సాగునీరు అందే పరిస్థితి లేకుండా పోయింది. వైసీపీప్రభుత్వం ఐదేళ్ళపాటు నీటిపారుదలశాఖకు ఎటువంటి నిధులు కేటాయించకపోవడంతో కనీస వసతులు కల్పించలేని దుస్థితి నెలకొంది. గంటవారిపాలెం సమీపంలోని అద్దంకి బ్రాంచ్ కెనాల్‌కు ఇరువైపులా కాలువ కట్టలపై పిచ్చిచెట్లు భారీగా పెరిగి కెనాల్‌లోకి అల్లుకుపోవడంతో నీటిప్రవాహానికి అడ్డుగా మారాయి. దానికి తోడు పిచ్చిచెట్లు భారీగా పెరిగిపోవడంతో కాలువకట్టలు బలహీనంగా మారుతున్నాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో అద్దంకి బ్రాంచ్ కెనాల్‌లో సిమెంట్‌తో కెనాల్‌కు ఇరువైపులా లైనింగ్ వేయడంతో పాటు కెనాల్ లోపల సిమెంట్‌తో చదును చేయడంతో నీటిప్రవాహానికి ఆటంకం లేకుండా చివరిభూముల వరకు సాగునీరందించారు. కెనాల్ నుంచి గ్రామాలకు వెళ్ళే మేజర్ కాలువలు కూడా ఎప్పటికప్పుడు బాగు చేయించి పూడిక తీయించి శుభ్రం చేయించారు. కానీ వైసీపీ ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో కెనాల్‌కు మరమ్మతులు పెరిగిపోయి నీరువిడుదలైన ప్రతీసారి లీకులతో నీరు వృథా అవుతోంది. ఉపాధి హామీ కూలీలతో మేజర్ కాలువల్లో గడ్డిని మాత్రం కోయించడం తప్ప పూడిక తీయించకపోవడంతో రోజుల వ్యవధిలోనే గడ్డి మరలా పెరిగిపోంది. త్వరలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్నందున సాగునీటి కోసం రైతులు అవస్థలు పడే పరిస్థితి నెలకొనియుంది. గంటవారిపాలెంలో 60ఏళ్ళ క్రితం నిర్మించిన ఎన్నెస్పీ భవనం శిథిలావస్థకు చేరుకొంది. ఏళ్ళతరబడి భవనానికి కనీస మరమ్మతులు చేయకపోవడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. ఎన్నెస్పీ కార్యాలయంలో కనీస వసతులు లేక సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దానికితోడు సిబ్బంది కొరత ఆ శాఖను వేధిస్తోంది. గంటవారిపాలెం సెక్షన్ కింద ఐదుగురు వర్క్ ఇన్‌స్పెక్టర్లు, 23మంది లస్కర్‌లు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం ఇద్దరు వర్క్‌ఇన్‌స్పెక్టర్లు, నలుగురు లస్కర్‌లు మాత్రమే ఉన్నారు. కెనాల్ పరిధిలోని రైతులు చెల్లించే నీటితీరువా పన్నులను రెవెన్యూ శాఖాధికారులు 2014నుంచి నీటిపారుదల శాఖకు చెల్లించకపోవడంతో సుమారు రూ.కోటి వరకు బకాయిలు నిలిచిపోయాయి. ఎన్నెస్పీ అధికారులు ఎన్నిసార్లు అడిగినా రెవెన్యూ శాఖాధికారులు స్పందించకపోవడంతో మిన్నకుండిపోయారు. కనీసం నీటితీరువా బకాయిలు చెల్లించినా కాలువ కట్టలపై పిచ్చిచెట్లు పీకించి చిన్నపాటి మరమ్మతుతో ఉపయోగపడతాయని ఎన్నెస్పీ అధికారులు చెబుతున్నారు. అద్దంకి కెనాల్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం 60లక్షలకు ఎస్టిమేషన్‌లు వేసి ప్రభుత్వానికి నివేదిక పంపామని, ప్రభుత్వం నిధులు విడుదలచేస్తే కెనాల్‌కు నీరు విడుదలయ్యేలోపు మరమ్మతులు పూర్తిచేసేందుకు తమవంతు కృషి చేస్తామని ఎన్నెస్పీ అధికారులు చెబుతున్నారు.



గంటవారిపాలెంలో శిథిలావస్థకు చేరిన ఎన్నెస్పీ కార్యాలయం

ప్రజలంతా పోలీసులకు సహకరించాలి

ఏఎస్పీ రాజశేఖర్



వినుకొండలో 144సెక్షన్ అమలును పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ రాజశేఖర్, డీఎస్పీ తిరుపతిరావు తదితరులు



తుమ్మలకుంటలో ప్రజలతో మాట్లాడుతున్న ఆక్టోపస్ డీఎస్పీ తిరుపతిరావు

వినుకొండ, జూన్ 2: జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఈ నెల 4న జరగనున్న ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఆదివారం వినుకొండ పట్టణంలో 144సెక్షన్ అమలు జరుగుతున్న తీరును అడిషనల్ ఎస్పీ రాజశేఖర్, డీఎస్పీ తిరుపతిరావులు పరిశీలించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ ప్రజలంతా పోలీసులకు సహకరించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా ఉండాలని, జూన్ 5వరకు ఎవ్వరూ గుంపులుగా ఉండరాదన్నారు. 144సెక్షన్ అమల్లో ఉన్నందున 5వ తేదీ వరకు అన్ని షాపులు మూసివేయాలని కోరారు. ఆయనతో పాటు పట్టణ సీఐ సాంబశివరావు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

డ్రోన్ నిఘాలో పట్టణం

నరసరావుపేట లీగల్, జూన్ 2: ఈ నెల 4న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా పట్టణం మొత్తాన్ని డ్రోన్ నిఘాలో పరిశీలించనున్నట్టు రెండో పట్టణ సీఐ ఆవుల భాస్కర్ ఆదివారం తెలిపారు. డ్రోన్ కెమేరాల నిఘాలో పాత కేసుల్లో నిందితులు ఎవరైనా రోడ్లపై కన్పిస్తే వారిపై రౌడీ షీట్లు ఓపెన్ చేయటం జరుగుతుందన్నారు. సాధారణ పౌరులు కూడా సెక్షన్ 144ను ఉల్లంగించి రోడ్లపై తిరిగినట్లయితే డ్రోన్ సాయంతో గుర్తించి వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని పౌరులు ఎవ్వరూ కూడా అత్యవసరమైతే తప్ప అనవసరంగా రోడ్లపై సంచరించవద్దని సూచించారు. పట్టణ వ్యాప్తంగా ఏ చిన్న సంఘటన జరిగినా డ్రోన్ నిఘా వల్ల తమ దృష్టికి వస్తుందని, వారిపై కఠిన మైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకొని పట్టణ పౌరులు పోలీసులకు సహకరించాలని కోరారు.

ప్రజలు సహకరించాలి: ఆక్టోపస్ డీఎస్పీ

శావల్యాపురం, జూన్ 2: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ముగిసేవరకు గ్రామాలలోని ప్రజలంతా వివాదాలకు దూరంగా ఉండాలని, ఎదుటివారితో శాంతియుతంగా నడుచుకోవాలని ఆక్టోపస్ డీఎస్పీ తిరుపతయ్య అన్నారు. మండలంలోని కొత్తలూరు, తుమ్మలకుంట గ్రామాల్లో పోలీసులు ఆదివారం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఆక్టోపస్ డీఎస్పీ తిరుపతిరావు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 144సెక్షన్ అమల్లో ఉన్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో దుకాణాలన్నీ మూసివేయాలని, ఈ నెల 4న జరగనున్న ఎన్నికల కౌంటింగ్ సమయంలో ప్రజలెవ్వరూ బయట తిరగకుండా ఇళ్ళలోనే ఉండాలని, ఎన్నికల ఫలితాలు వెల్లడించాక ఊరేగింపులు, సంబరాలు నిర్వహించరాదని, బాణసంచా కాల్చరాదని, ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాలలో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదుచేసి రౌడీషీట్లు ఓపెన్ చేస్తామన్నారు. ఉద్యోగులు, యువత లేనిపోని గొడవల్లో తలదూర్చి జీవితాలు నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ఓటర్లు ఇచ్చిన తీర్పును ప్రతి ఒక్కరూ గౌరవించాలే తప్ప గొడవలకు పాల్పడకూడదన్నారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు సంచరించినా, మరేవైనా సమస్యలున్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలన్నారు. తనిఖీల్లో వినుకొండ రూరల్ సీఐ ఉప్పుటూరి సుధాకర్‌రావు, సీఐలు హజరతయ్య శ్రీనివాసరావు, ఎస్‌ఐలు చల్లా సురేష్, చెన్నకేశవులు, లక్ష్మీనారాయణరెడ్డి, మహమ్మద్ ఫిరోజ్, కానిస్టేబుళ్ళు పాల్గొన్నారు.

మూత పడిన షాపులు...

నాదెండ్ల, జూన్ 2: పోలీసులు మండలంలో 144 సెక్షన్ అమలు చేయటంతో ఆయా గ్రామాల్లోని వ్యాపార దుకాణాలు, టీ షాపులు తదితరాలు మూతపడ్డాయి. గ్రామాల్లోని ప్రధాన వీధులు కూడా నిర్మానుష్యంగా మారాయి. కర్ఫ్యూని తలపించేలా పరిస్థితులు నెలకొన్నాయి. ప్రధానంగా గణపవరం, నాదెండ్ల, సాతులూరు గ్రామాలతో పాటు చిన్న గ్రామాల్లో సైతం ఈ పరిస్థితి నెలకుంది. జనం ఎక్కడ గుమికూడినా పోలీసులు వారికి హెచ్చరికలు జారీ చేస్తున్నారు. చిన్న వ్యాపారులు 144 సెక్షన్‌తో షాపులు మూతపడటం వల్ల నానా ఇబ్బందులు పడుతున్నారు. సామాన్య ప్రజలకు కూడా ఇబ్బందిగా మారింది.

నిర్మానుష్యంగా వీధులు

రొంపిచర్ల, జూన్ 2 : మండలంలోని గ్రామాల్లో ఎన్నికల ఫలితాల నేపథ్యంలో 144 సెక్షన్ విధించారు. వ్యాపార దుకాణాలు, వీధి వ్యాపారాలు నిలిపి వేశారు. దీంతో ప్రధాన వీధులన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఫలితాల అనంతరం ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా బందోబస్తు కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్టు ఎస్‌ఐ పాల్ రాజ్ రవీంద్ర ఆదివారం తెలిపారు. మండలంలోని గ్రామాల్లో మైకు ద్వారా ప్రచారాన్ని నిర్వహించారు. ఫలితాల అనంతరం టపాసులు పేల్చటం, ర్యాలీలు చేయటం నిషేదమని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



గణపవరంలో, రొంపిచర్లలో మూతపడిన షాపులు, జనసంచారం తక్కువగా ఉన్న వీధులు

పార్టీ కార్యాలయాల వద్ద భద్రతా ఏర్పాట్లు

పిడుగురాళ్ల, జూన్ 2: సాధారణ ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో పిడుగురాళ్లలో టీడీపీ, వైసీపీ కార్యాలయాల వద్ద పోలీసులు తగిన భద్రతా ఏర్పాట్లు చేశారు. అనుమతి లేకుండా వాహనాలు, బయటి వ్యక్తులు ఎవరూ కార్యాలయాల వద్దకు పోకుండా బారికేడ్లు అడ్డుపెట్టి పోలీసులను కాపలాగా నియమించారు. పిడుగురాళ్లలో ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు, వైసీపీ అభ్యర్థి కాసు మహేష్ రెడ్డి కార్యాలయాల వద్ద కూడా బారికేడ్లు అడ్డుపెట్టి ఇద్దరు కానిస్టేబుల్స్‌ను కాపలాగా ఉంచారు.

ఫలితాలు వెలువడిన అనంతరం ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్తలో భాగంగా ఇరు పార్టీల నేతలు, పార్టీ కార్యాలయాల వద్ద తగిన భద్రత ఏర్పాటుచేసినట్లు పట్టణ సీఐ ఆంజనేయులు తెలిపారు.

అటవీ ప్రాంతంలో పోలీసుల తనిఖీ

● 30 లీటర్ల నాటుసారా స్వాధీనం

నకరికల్లు, జూన్2: చేజర్ల తండా సమీపానగల అటవీప్రాంతంలో ఆదివారం ఎస్‌ఐ పీ.రాంబాబు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది విస్తృత తనిఖీ నిర్వహించి 30 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. నాటు సారా బట్టి ప్రాంతాలను, వాములు, దిబ్బలను విస్తృతంగా జల్లెడపట్టారు. సారా తయారుచేస్తే కఠిన చర్యలు తీసు కుంటామని ఎస్‌ఐ పీ.రాంబాబు హెచ్చరికలు జారీ చేశారు. చేజర్ల గ్రామానికి చెందిన బాణావత్ కృష్ణానాయక్, బాణావత్ శివనాయక్, బాణావత్ శంకర్‌నాయక్‌లు కలసి నాటుసారాను తీసుకొని వస్తుం డగా వారిని పట్టుకొనే ప్రయత్నంలో బాణావత్ రామకృష్ణనాయక్ పోలీసులకు చిక్కాడు. మిగతా ముగ్గురు పరారయ్యారు. రామకృష్ణ నాయక్ వద్ద ఉన్న 30 లీటర్ల నాగు సారాను స్వాధీనం చేసుకు న్నారు. అతడిని పోలీసు స్టేషన్‌కు తీసుకు వచ్చి ఎస్‌ఐ పీ.రాంబాబు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



సారా బట్టీల వద్ద తనిఖీ చేస్తున్న పోలీసులు, స్వాధీనం చేసుకున్న సారా

రాష్ట్రంలో కూటమి ప్రభంజనం

● వినుకొండ కూటమి అభ్యర్థి జీవీ ఆంజనేయులు



వినుకొండ కూటమి అభ్యర్థి జీవీ ఆంజనేయులు

వినుకొండ, జూన్ 2: రాష్ట్రంలో కూటమి ప్రభంజనం రాబోతుందని టీడీపీ సీనియర్ నాయకులు, వినుకొండ కూటమి అభ్యర్థి జీవీ ఆంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 4న రాబోతున్నవి ఎన్నికల ఫలితాలే కాదని, ఏపీ భవిష్యత్తును నిర్దేశించేందుకు ప్రజలు రాసిన శాసనాలన్నారు. వైసీపీ ఐదేళ్ళ పాలన, జగన్ అరాచకాల పట్ల ప్రజలు ఎంత విసిగిపోయారో ఎగ్జిట్ పోల్స్ తెలిపాయన్నారు. చంద్రబాబును సీఎంని చేసుకోవాలని ప్రజలంతా కృతనిశ్చయంతో ఓట్లేశారని, ప్రతివర్గం కూటమి వైపు నిలబడబట్టే త్వరలో కనీవినీ ఎరగని విజయం సాధించబోతున్నామన్నారు. గాడితప్పిన రాష్ట్రాన్ని నిలబెట్టే శక్తి, సామర్థ్యాలు చంద్రబాబుకు మాత్రమే ఉన్నాయని ప్రజలు నమ్మారన్నారు. అమరావతి, పోలవరం పూర్తి కావాలన్నా, యువతకు ఉద్యోగాలు, అన్ని వర్గాలవారికి సంక్షేమం కూటమితోనే సాధ్యమని ప్రజలు మద్దతునిచ్చారన్నారు. 150కి పైగా అసెంబ్లీ స్థానాలను, 20కి పైగా లోక్‌సభ స్థానాలను సాధించబోతున్నామని, చంద్రబాబు అనుభవాన్ని, పవన్ కళ్యాణ్, లోకేశ్‌ల యువ నాయకత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఈ ఎన్నికల ద్వారా చంద్రబాబు పోరాట స్ఫూర్తిని యావత్తు దేశమంతా మరోసారి గమనించిందన్నారు. వైసీపీ చేస్తున్న దాడులను తట్టుకొంటూ చంద్రబాబు అలుపెరగని పోరాట ఫలితమే నేటి సార్వత్రిక ఎన్నికల ఫలితాలన్నారు. వయస్సు, ఆరోగ్యాన్ని కూడా లెక్క చేయకుండా చంద్రబాబు కురుక్షేత్ర ఉద్యమం చేశారన్నారు. వినుకొండ చరిత్రలోనే అత్యధిక మెజారిటీతో బొల్లాపై విజయం సాధించబోతున్నామని, నర్సరావుపేట లోక్‌సభ స్థానంతో పాటు ఏడు అసెంబ్లీ స్థానాలను గెలవబోతున్నామని జీవీ ధీమా వ్యక్తం చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో అంకెల గారడీ

రొంపిచర్ల, జూన్ 2: మండలంలోని రొంపిచర్ల, విప్పర్ల, మునమాక సెక్టార్ల పరిధిలో 77 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతూ వస్తుంది. ఆయా కేంద్రాల్లో నిర్వహించే కార్యక్రమాలను కూడా సక్రమంగా చేయటం లేదని విమర్శలు వినవస్తున్నాయి. హాజరయ్యే వారి సంఖ్య తక్కువగా ఉండటం, రిజిస్టర్లలో ఎక్కువ చూపించటం వంటి ఘటనలు పలుచోట్ల చోటు చేసుకుంటున్నాయి. అంతేగాక అంగన్‌వాడీ కేంద్రాలు పలుచోట్ల సొంత గృహాల వద్ద నిర్వహించటంతో అక్కడ అంగన్‌వాడీ వర్కర్ లేదా ఆయా మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. మూడు సెక్టార్ల పరిధిలో పలువురు అంగన్‌వాడీ వర్కర్లు నరసరావుపేట నుంచి తాము విధులు నిర్వహించే గ్రామాలకు వెళ్తున్నారు. సంబంధిత అధికారులకు తెలిసినా ఏమీచేయలేక మిన్నకుండిపోతున్నారు. నానాటికీ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుంది. కార్యక్రమాలు నిర్వహించాల్సిన పలువురు అంగన్‌వాడీ వర్కర్లు స్థానిక ప్రజాప్రతినిధులకు, ప్రభుత్వ అధికారులకు తెలియజేయటం లేదు. దీంతో ప్రజలకు అవగాహన లేక అంగన్‌వాడీ కేంద్రాలకు పంపటం మాని వేస్తున్నారు. అధికారులు ఇటువంటి ఘటనలపై చర్యలు తీసుకోకపోతే చిన్నారుల సంఖ్య మరింత తగ్గిపోయే అవకాశం ఉంది.

భగవద్గీత కంఠస్థ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన మాధవికి సత్కారం



మాధవిని సత్కరిస్తున్న ఆంజనేయ భక్త సమాజం సభ్యులు

వేమూరు, జూన్ 2: మైసూరు దత్త పీఠం గణపతి సచ్చిదానంద స్వామిజీ ఇటీవల నిర్వహించిన ఆల్ ఇండియా భగవద్గీత కంఠస్థ పోటీలలో మండలంలోని కుచ్చెళ్ళపాడు గ్రామానికి చెందిన తాడికొండ మాధవి గోల్డ్ మెడల్ సాధించారు. స్వామిజీ చేతుల మీదుగా గోల్డ్ మెడల్‌తో పాటు ప్రశ్నాపత్రాన్ని అందుకుని మంగళ శాసనాలు పొందారు. జంపని గ్రామంలో నిర్వహిస్తున్న హనుమజ్జయంతి వార్షిక ఉత్సవ కైంకర్యాదులలో వీరాంజనేయ భక్త సమాజం వారు మాధవిని ఆదివారం ఘనంగా సత్కరించారు. నాదెండ్ల సురేష్‌బాబు దివ్య దంపతులు మాధవికి నూతన వస్త్రాలు సమర్పించి వెండి రామ పరివార చిత్రపటాన్ని అందించారు. ఆల్ ఇండియా అర్చక ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ మాధవి దశాబ్ద కాలం నుండి ఆధ్యాత్మిక ప్రచారకర్తగా వ్యవహరిస్తూ ఎందరినో ధార్మిక మార్గంలోకి నడుపుతోందన్నారు. కార్యక్రమంలో పెరుమాళ్ళ వెంకట సుబ్బయ్య, కొలిపాకుల మస్తాన్‌రావు, కలవ వెంకట రాధా మధుసూదనరావు, మొవ్వ మల్లికార్జునరావు, తాడికొండ సుధీర్‌బాబు, సోమరవుతూ బ్రహ్మం, తిరుమల తిరుపతి దేవస్థానాల దాస సాహిత్య ప్రాజెక్టు భజన సంఘాల వారు తదితరులు పాల్గొన్నారు.

సముద్రంలో మునిగిన యువకుడిని కాపాడిన ఈతగాళ్లు



చికిత్స పొందుతున్న యువకుడు

బాపట్ల, జూన్ 2: సూర్యలంక సముద్రతీరంలో మునుగుతూ గల్లంతు అవుతున్న యువకుడిని గుర్తించిన మెరైన్ ఔట్‌పోస్ట్‌సిబ్బంది గజఈతగాళ్ళ సాయంతో ఒడ్డుకు చేర్చారు. హైదరాబాద్‌కు చెందిన గౌస్ సూర్యలంక సముద్రస్నానానికి ఆదివారం వచ్చాడు. విద్యార్థులంతా కలిసి వచ్చినప్పటికి గౌస్ మునిగిపోతున్నట్లు గుర్తించిన గజ ఈతగాళ్ళు రక్షించి ఏరియా వైద్యశాలకు తరలించారు. సముద్రపు నీరు తాగటం వల్ల ఊపిరితిత్తులలోకి చేరుకుందని ఏరియా వైద్యశాలలో ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిచారు.

ఆగి ఉన్న బస్సును ఢీకొని వృద్ధుడికి గాయాలు

బాపట్ల, జూన్ 2 : పట్టణంలోని పాతబస్టాండ్ కూడలిలో ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి స్కూటీపై వచ్చిన వ్యక్తి ఢీకొట్టటంతో కిందపడి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు.

అంగరంగ వైభవంగా ఆంజనేయుని రథోత్సవం



వీరాంజనేయ స్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

వేమూరు, జూన్ 2 : మండలంలోని జంపని గ్రామంలో ఆదివారం ఆంజనేయ స్వామి వారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న వార్షిక హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఏకాదశి దీక్షతో నిర్వహిస్తున్న ఉత్సవాలు చివరి రోజు రథోత్సవాన్ని నిర్వహించారు. పెరుమాళ్ళ వెంకట సుబ్బయ్య, పెరుమాళ్ళ రామయ్య, డాక్టర్ అబ్దుల్ కలాం ఆజాద్ దంపతులు రథోత్సవ కర్తలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపించారు. కొలిపాకుల మస్తాన్‌రావు కలవ వెంకట రాధా మధుసూదనరావు పర్యవేక్షణలో జరిగిన ఉత్సవ కైంకర్యంలో తిరుమల, తిరుపతి దేవస్థానాల దాస సాహిత్య ప్రాజెక్టు భజన మండలి సభ్యులు, శ్రీ ఆంజనేయ భక్త సమాజం, ఆంజనేయ యువజన భక్త సమాజాల వారు కోలాట భజనలు చేసి స్వామి వారి భజన కీర్తనలు ఆలపించారు. మేళతాళాలు, బాణాసంచా నడుమ భక్తులు హనుమనామ సంకీర్తన జరిపారు. గ్రామస్తులు వీధి వీధినా సువర్చల సహిత ఆంజనేయ స్వామికి హారతులు ఇచ్చి పానకం, వడపప్పు నివేదింపజేసి భక్తులకు వినియోగించారు.